




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 250, పేజీలు - 08

మంగళవారం, ఫిబ్రవరి 24, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD






## రంజాన్ రోజున బడ్జెట్

**- మార్చి 16 నుంచి 30 వరకు అసెంబ్లీ సమావేశాలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశమైన తెలంగాణ కేబినెట్ పలు ముఖ్యమైన నిర్ణయాలకు ఆమోదం కల్పించింది. ఈ క్రమంలోనే తెలంగాణ బడ్జెట్ సమావేశాల తేదీలను నిర్ణయించింది. మార్చి 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నారు. మార్చి 16వ తేదీన గవర్నర్ ప్రసంగం మార్చి 17, 18వ తేదీల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. ఇక మార్చి 20వ తేదీన తెలంగాణ ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 2026-2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను సభలో ప్రవేశ పెట్టనున్నారు.

2లో..

## తెలంగాణలో మారుతున్న రాజకీయం

**- కామారెడ్డి నుంచే స్టార్ట్**

**- బీజేపీ వర్సెస్ కాంగ్రెస్‌గా మారుతోందా.?**




(గౌటీ బాల సాయి తిలక్ - ప్రశ్న న్యూస్)

తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ప్రస్తుతం ఆసక్తికరమైన మలుపు తిరుగుతోంది. కాంగ్రెస్, బీజేపీ మధ్య సాగుతున్న ప్రత్యక్ష పోరాటాలు ప్రజాక్షేత్రంలో హోరెత్తుతుంటే, ప్రధాన ప్రతిపక్షంగా ఉండాల్సిన బీఆర్ఎస్ వ్యూహాత్మక మౌనం పాటిస్తోందనే చర్చ జరుగుతోంది.

### ద్విముఖ పోరాటంగా మారుతున్న రాజకీయం

రాష్ట్రంలో ప్రధాన పోటీ తమ మధ్యే అన్నట్లుగా కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు వీధి పోరాటాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. కామారెడ్డిలో మొదలైన నిరసన జ్వాలలు క్రమంగా రాష్ట్రమంతటా విస్తరించడం చూస్తుంటే ప్రజల్లో ఇతర ప్రత్యామ్నాయం లేదనే భావన కలిగించడం ఈ రెండు పార్టీల ఉమ్మడి ఎత్తుగడగా కనిపిస్తోంది. క్షేత్రస్థాయి సమస్యలపై ఈ రెండు పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకుంటూ వార్తల్లో నిలుస్తుండటంతో రాజకీయం అంతా వారి చుట్టూనే తిరుగుతోంది.

### బీఆర్ఎస్ సైలెంట్ వెనుక అసలు వ్యూహం

మరోవైపు బీఆర్ఎస్ అధినాయకత్వం ప్రస్తుతానికి కొంత వెనక్కి తగ్గినట్లు కనిపిస్తున్నా, అది ముందస్తు వ్యూహంలో భాగమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు బీజేపీ వైపు మళ్లకుండా ఉండేందుకు, అధికార పక్షం వైఫల్యాలను ఎండగట్టే సరైన సమయం కోసం వేచి చూసే ధోరణిని గులాబీ దళం అనుసరిస్తోంది. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, ప్రభుత్వ పథకాల అమలులో లోపాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం ద్వారా మళ్ళీ రేసులోకి రావాలని ప్లాన్ చేస్తోంది.

### తిరుగుబాటు దిశగా గులాబీ కేడర్

కేవలం మౌనంగా ఉంటే ఇతర పార్టీల దూకుడు పెరిగి తమ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది. దీనిని అధిగమించేందుకు త్వరలోనే పార్టీ అధిష్టానం నియోజకవర్గాల వారీగా భారీ బహిరంగ సభలు, పాదయాత్రలు లేదా ఇతర ఆందోళన కార్యక్రమాలకు రూపకల్పన చేసే అవకాశం ఉంది. కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా క్యాడర్‌ను ఉత్తేజితం చేసేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

### మున్సిపల్ ఎన్నికల ఫలితాల పాఠం

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్‌కు

2లో..

## కర్ణాటక కాంగ్రెస్‌కు కొత్త చిక్కు

**- నాయకత్వ మార్పుపై కొనసాగుతున్న సస్పెన్స్**



బెంగుళూరు (ప్రశ్న న్యూస్) కర్ణాటక కాంగ్రెస్‌లో నాయకత్వ మార్పుపై కొనసాగుతున్న సస్పెన్షన్ ఇంకా వీడలేదు. సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య సీఎం కుర్చీ కోసం మరోసారి ఆసక్తికర పోరు నెలకుంది. సీఎం మార్పు తప్పదని కొన్నాళ్లుగా ప్రచారం సాగుతోంది. ఈ సాగదీత పార్టీకి మంచిది కాదని, 2028 ఎన్నికల్లో గెలవాలంటే తప్పకుండా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని అధిష్ఠానాన్ని కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు. కర్ణాటక పంచాయతీ హైకమాండ్‌కు పంటి కింద నలుసులా మారింది. ఈ తరుణంలో మరో కొత్త తలనొప్పి వచ్చి పడింది. క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ కోరుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలతో పాటు సీఎం సిద్ధరామయ్య, డీకేలకు తొలిసారి గెలిచిన 38 మంది ఎమ్మెల్యేలు లేఖ రాశారు. కొత్తగా ఎన్నికైన తమకు క్యాబినెట్‌లో అవకాశం కల్పించాల్సి కోరుతూ 'యువ నాయకత్వం కోసం ప్రజల నుంచి వచ్చిన స్పష్టమైన తీర్పు' అని వారు

2లో..

## తిరుమల ప్రక్షాళనకు స్వర్ణ వ్యూహం

**- పరిశీలన ప్రారంభించిన ఏపీ ప్రభుత్వం**

అమరావతి (ప్రశ్న న్యూస్) తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడటంతో పాటు, పాలనలో రాజకీయ జోక్యాన్ని పూర్తిగా తొలగించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయం తరహాలో తిరుమలకు కూడా ప్రత్యేక చట్టం తీసుకురావాలనే ఆలోచనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం పరిశీలిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదం నాణ్యత, పాలకమండలి నియామకాలపై అనేక వివాదాలు తలెత్తుతున్నందున టీటీడీని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చకుండా అడ్డుకట్ట వేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. స్వర్ణ దేవాలయాన్ని నిర్వహిస్తున్న శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ తరహాలో టీటీడీకి పూర్తి స్వయం ప్రతిపత్తిని కల్పించే చట్టం తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనివల్ల ప్రభుత్వాలు మారినా ఆలయ పవిత్రతకు, సంప్రదాయాలకు విఘాతం కలగకుండా ఉంటుంది.

**- ఏమిటి ఈ స్వర్ణ దేవాలయ చట్టం?**

పంజాబ్‌లోని సిక్కుల పవిత్ర క్షేత్రమైన స్వర్ణ దేవాలయం నిర్వహణను



1925 నాటి సిక్కు గురుద్వారా చట్టం ద్వారా పర్యవేక్షిస్తారు. ఈ చట్టం ప్రకారం, గురుద్వారాల నిర్వహణ బాధ్యతను రాజకీయ నాయకుల చేతుల్లో కాకుండా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన సిక్కు ప్రతినిధుల చేతుల్లో ఉంచుతారు. ఈ కమిటీకి సంబంధించి ఎన్నికలు కేంద్ర ఎన్నికల సంఘం పర్యవేక్షణలో జరుగుతాయి.

2లో..

## హైదరాబాద్ మెట్రో స్వాధీనానికి తెలంగాణ కేబినెట్ ఓకే

**- ఎల్ అండ్ టీ నుంచి ఇక ప్రభుత్వం చేతుల్లోకి**

**- ఎల్ అండ్ టీతో సూత్రప్రాయంగా గత ఏడాది ఒప్పందం**

**- రూ.13 వేల కోట్ల రుణాలను బదలాయించుకోనున్న ప్రభుత్వం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో హైదరాబాద్ మెట్రో భవిష్యత్తుకు సంబంధించి అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఎల్ అండ్ సంస్థ ఆధ్వర్యంలో ఉన్న మెట్రో ఫేజ్-1 నిర్వహణను ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా, అంటే మార్చి 31, 2026 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు ఐడీబీఐ అందించిన ఆర్థిక నివేదికలు, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఇచ్చిన సాంకేతిక నివేదికలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మెట్రో ప్రాజెక్టును ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలనే నిర్ణయం వెనుక బలమైన కారణాలు ఉన్నాయి. ఎల్ అండ్ టీ సంస్థ ఎదుర్కొంటున్న ఆర్థిక భారంతో పాటు, మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు పొందడంలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను అధిగమించేందుకు ఈ అడుగు పడింది. మెట్రో ఫేజ్-1 ప్రైవేటు సంస్థ చేతుల్లో ఉండటం వల్ల, ప్రభుత్వ భాగస్వామ్యంతో చేపట్టే రెండో దశ విస్తరణకు కేంద్రం నిధులు కేటాయించడంలో జాప్యం చేస్తోంది.

2లో..

## కల్తీ పాల ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్

**- రాజమండ్రి కల్తీ పాల ఘటనపై సీఎం సమీక్ష**

**- కల్తీపాల మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం**

**- శాసనసభలో ప్రటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**

**- నివేదిక రాగానే బాధ్యుడిపై కఠిన చర్యలు తీసుకుంటామన్న సీఎం**



అమరావతి(ప్రశ్న న్యూస్) రాజమహేంద్రవరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్‌లో కల్తీపాల వినియోగంతో మృత్యువాత పడిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ. 10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. రాజమహేంద్రవరంలో జరిగిన ఈ ఘటనపై శాసన సభలో మాట్లాడిన సీఎం బాధిత కుటుంబాలకు పరిహారాన్ని ప్రకటించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరిస్తుందని తెలిపారు. మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

**- కల్తీపాల ఘటన చాలా బాధాకరం**

శాసన సభలో రాజమహేంద్రవరం ఘటనపై సీఎం చంద్రబాబు మాట్లాడుతూ,రాజమహేంద్రవరం

2లో..

## నా పేరుతో ఎలాంటి సంస్థలకు అనుమతి లేదు

**- కేటీఆర్ సేవా సమితి, కేటీఆర్ సేవ పేరుతో కార్యకలాపాలు**

**- తన పేరుతో ఎలాంటి సంస్థల నిర్వహణకు అనుమతి లేదని స్పష్టీకరణ**

**- ఎవరైనా పని చేయాలనుకుంటే బీఆర్ఎస్ పార్టీలో కలిసి పని చేయాలని సూచన**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన పేరుతో సాగుతున్న అనధికారిక సంస్థల కార్యకలాపాలపై తీవ్రంగా స్పందించారు. కేటీఆర్ సేవా సమితి , కేటీఆర్ సేన వంటి పేర్లతో కొందరు వ్యక్తులు ప్రత్యేక గ్రూపులు, సంస్థలను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన దృష్టికి వచ్చింది. దీనిపై స్పందించిన ఆయన, తన పేరుతో ఎలాంటి ప్రైవేటు సంస్థల నిర్వహణకు తాను అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఒకవేళ తనపై అభిమానం ఉంటే ఆ శ్రమను, ఉత్సాహాన్ని నేరుగా పార్టీ బలోపేతం కోసం బీఆర్ఎస్ వేదికగానే ఖర్చు చేయాలని ఆయన అభిమానులకు పిలుపునిచ్చారు.

2లో..

## ఒక్క గజం భూమిని ఆక్రమించినట్టు నిరూపిస్తే పదవి వదులుకుంటా

**- షబ్బీర్ అలీకి వెంకటరమణారెడ్డి ఛాలెంజ్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) డిగ్రీ కళాశాల భూముల వ్యవహారం ఇప్పుడు కామారెడ్డి రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఈ భూముల అంశంలో తనపై వస్తున్న అవినీతి ఆరోపణలను

2లో..

## స్టాలిన్ కు, నాకు మధ్యనే ప్రత్యక్ష పోరు

**- జల్లికట్టు ఎద్దులా తమిళనాడు రాజకీయమన్న విజయ్**



చెన్నై (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌పై తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, నటుడు విజయ్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు ఢిల్లీ రాజకీయాలకు సంబంధించినవి కావని, రాష్ట్రంలోని అవినీతి, పాలనకు సంబంధించినవని స్పష్టం చేశారు. ఈ ఎన్నికలు విజయ్, స్టాలిన్‌ల మధ్య ప్రత్యక్ష పోరాటమని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. వెల్లూరు జిల్లా కొల్లమంగళంలో పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో జరిగిన అంతర్గత సమావేశంలో ఆయన మాట్లాడారు. "స్పష్టంగా చెప్పాలంటే ఈ ఎన్నికలు విజయ్, స్టాలిన్‌ల మధ్య యుద్ధం. ఇది తమిళనాడు ప్రజలకు, అవినీతికి మధ్య ప్రజలకు, లంచగొండితనానికి

2లో..

## జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం

**-జోగులాంబ గద్వాల జిల్లాలో రైతు సంఘర్షణ సభలో పాల్గొన్న కవిత**

**-భవిష్యత్తులో జోగులాంబ జిల్లా నుంచే కార్యక్రమాలు చేపడతామని హామీ**

**-నడిగడ్డను బీఆర్ఎస్ మోసం చేసిందన్న కవిత**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ పూర్తిగా ఫెయిల్ అయిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగిన 'రైతు సంఘర్షణ' సభలో ఆమె మాట్లాడుతూ, తనకు జోగులాంబ అమ్మవారు సెంటిమెంట్ అని తెలిపారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఏ కార్యక్రమం మొదలైనా ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ జిల్లా నుంచి ఎక్కువగా ప్రారంభమయ్యేదని అన్నారు. కానీ భవిష్యత్తులో మనం ఏర్పాటు చేయబోయే పార్టీ మొదలు అన్నీ జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ప్రారంభం చేయాలని నిర్ణయించుకున్నానని అన్నారు. ఇక్కడి నడిగడ్డ ప్రజలు నిజాయతీపరులని, అలాగే ఈ గడ్డపై నుంచి ఏ కార్యక్రమం ప్రారంభించినా జోగులాంబ అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని భావిస్తున్నానని అన్నారు. పరిశ్రమలకు కరెంట్ ఇస్తున్నారు కానీ కష్టపడి పనిచేసే రైతులకు ఇవ్వడం లేదని విమర్శించారు. జోగులాంబ అమ్మవారి దయతో గద్వాల జిల్లా నుంచే తెలంగాణ జాగృతి జైత్రయాత్ర ప్రారంభమైందని అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీని తాము గెలుచుకున్నామని వెల్లడించారు. కానీ వడ్డేపల్లిలో తాము గెలిచిన తర్వాత తమ వారిని అధికార పార్టీ వారు దగ్గరకు తీసుకున్నారని మండిపడ్డారు. అసలు గద్వాల ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని సవాల్ చేశారు. ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని వారు ఎమ్మెల్యేగా ఉన్నారని మండిపడ్డారు. సమాధానం చెప్పకుంటే

2లో..

# తెలంగాణలో మారుతున్న రాజకీయం

కొంత హెచ్చరికగా మారాయి. కాంగ్రెస్ తన పట్టును నిరూపించుకోగా, బీజేపీ కొన్ని పట్టణ ప్రాంతాల్లో పుంజుకుంది. ఈ ఫలితాల తర్వాత బీఆర్ఎస్ తన శైలిని మార్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఓటర్ల నాడిని పట్టుకోవడంలో ఎక్కడ విఫలమయ్యామనే అంశంపై ఇప్పటికే అంతర్గత సమీక్షలు ప్రారంభమయ్యాయి. స్థానిక నేతలను సమన్వయం చేసుకుంటూ ప్రజల్లోకి వెళ్లడమే తదుపరి లక్ష్యంగా కనిపిస్తోంది.

### రేసులోకి ఎలా వస్తుంది?

బీఆర్ఎస్ మళ్లీ తన ప్రాభవాన్ని చాటుకోవాలంటే కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, నిర్మాణాత్మక పోరాటాలు చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా నీళ్లు, నిధులు, నియామకాల అంశంపై మరోసారి గళం విప్పడం ద్వారా తెలంగాణ అస్తిత్వ కార్డును వాడే అవకాశం ఉంది. కాంగ్రెస్ వైఫల్యాలను, బీజేపీ రాజకీయాలను ఒకేసారి టార్గెట్ చేస్తూ తెలంగాణ రక్షించే పార్టీ అనే నినాదంతో ముందుకు వెళ్తేనే తిరిగి ఆ రెండు పార్టీలకు ధీటైన పోటీ ఇచ్చే అవకాశం ఉంటుంది.

# కర్ణాటక కాంగ్రెస్‌కు కొత్త చిక్కు

ఆ లేఖలో అభివర్ణించారు. 2023 ఎన్నికల్లో విజయం తర్వాత 34 మందితో ఏర్పడిన మంత్రివర్గంలో తమలో ఎవరికి అవకాశం ఇవ్వలేదని వారు పేర్కొన్నారు. 'మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినవారికి కూడా క్యాబినెట్‌లో చోటు కల్పించడం న్యాయమైందే' అని డిమాండ్ చేశారు. కొత్తవారికి అవకాశాలు ఇవ్వాలని కోరిన వారు.. కనీసం ఐదుగుర్ని క్యాబినెట్‌లోకి తీసుకుంటే అనుభవానికి యువశక్తి,తోడైతే పాలన మరింత మెరుగుపడటానికి సహాయపడుతుందని వాదించారు. తొలిసారిగా ఎమ్మెల్యేలుగా గెలిచిన తమకు మంత్రులుగా అవకాశం కల్పించడం అవసరమని పేర్కొన్నారు.అంతేకాదు, భారత రాజకీయాల్లో కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలకు క్యాబినెట్‌లోకి తీసుకోవడం అసాధారణమేమీ కాదన్న వారు పలు రాష్ట్రాల్లో మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలకు మంత్రులుగా, సీఎంలుగా కీలక బాధ్యతలు అప్పగించిన సందర్భాలున్నాయని వారు గుర్తుచేశారు. కాంగ్రెస్ సిద్ధాంతం, పారదర్శక పాలన పట్ల తమ నిబద్ధతను నొక్కి చెబుతూ యువ ఎమ్మెల్యేలకు ప్రాతినిధ్యం కల్పించడం వల్ల పార్టీ సంస్థాగతంగా బలోపేతమవుతుందని, 2028 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని నిలుపుకోవడంలో సహాయపడుతుందని ఆ ఎమ్మెల్యేలు విశ్వాసం వ్యక్తం చేశారు. ఇప్పటికే నాయకత్వం మార్పుపై మల్లగుల్లాలు పడుతున్న కాంగ్రెస్ అధిష్ఠానికి ఈ లేఖతో కొత్త చిక్కు వచ్చి పడింది.నాయకత్వ మార్పుపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్ట్ సంచలనంగా మారింది.

తనను దెబ్బతీయడానికి కొందరు కుట్రలు చేస్తున్నారని, సామాజికంగా వెనుకబడిన వర్గానికి చెందిన తనపై రాజకీయ కుట్రలు సహజమేనని సిద్ధరామయ్య అన్నారు. అయితే, తాను పిరికివాడిని కాదని, అలాగే తన రాజకీయ జీవితం పూలబాట కాదన్నారు. ప్రజా మద్దతుతోనే రాళ్లు, ముళ్లున్న రాజకీయ రహదారిని దాటుతూ వచ్చానని ఆయన పేర్కొన్నారు. కాగా, ఇటీవల తనను కలిసిన మంత్రులు సతీష్ జార్ఖిహోళి, మాజీ మంత్రి రాజణ్ణ, ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వీలైనంత త్వరగా సమస్యకు పరిష్కారం సూచిస్తామని చెప్పారు.

# రంజాన్ రోజున బడ్జెట్

ఇక మార్చి 19వ తేదీన తెలుగు సంవత్సరాది అయిన ఉగాది పండుగ 20వ తేదీన ముస్లిం పండగ రంజాన్ ఉండటం గమనార్హం. అనూహ్యంగా బడ్జెట్ ప్రవేశ పెట్టే రోజు.. రంజాన్ పండగ ఒకేరోజు కావడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది. మరోవైపు తెలంగాణ కేబినెట్ సమావేశంలో మరిన్ని నిర్ణయాలకు ఆమోదం లభించింది. తాజా నిర్ణయాలతో రాష్ట్ర వైద్య రంగంలో కీలక సంస్కరణలు తీసుకురానున్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పేరును ఇక నుంచి డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మారుస్తూ కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ నిర్ణయంతోపాటు ఇప్పటివరకు తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్న ఉద్యోగులను ఇక నుంచి పూర్తిస్థాయి ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించనున్నారు.

ఈ నిర్ణయంతో వేలాది మంది వైద్య సిబ్బందికి లబ్ధి చేకూరనుంది. హైదరాబాద్ మెట్రోను స్వాధీనం చేసుకోవాలని ఇప్పటికే నిర్ణయించగా.. దానికి సంబంధించి నలుగురు మంత్రులతో కలిసి కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారు.

ఖమ్మంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కి 20 ఎకరాల భూమిని కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయానికి తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ ఆఫీసులకు భూ కేటాయింపులు చేస్తూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లా గుమ్మడూరులో జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) కాలేజీ నిర్మాణానికి 70 ఎకరాల కేటాయింపునకు ఆమోదం తెలిపింది. మరోవైపు టీజీఎస్ఆర్టీసీకి ఒలెక్ట్రా అనే సంస్థ 1085 ఎలక్ట్రిక్ బస్సులను అందించనుంది. పీఎం ఈ-డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రిక్ బస్సులను సరఫరా చేయనుంది. దీనికి సంబంధించి తాజాగా టీజీఎస్ఆర్టీసీ లెటర్ ఆఫ్ ఇంటెంట్ జారీ చేసింది.

# తిరుమల ప్రక్షాళనకు స్వర్ణ వ్యూహం

కమిటీ సభ్యులు కేవలం మతపరమైన అంశాలు, సామాజిక సేవ, ఆధ్యాత్మిక అభివృద్ధిపైనే దృష్టి సారిస్తారు.

### - రాజకీయ జోక్యానికి శాశ్వత పరిష్కారం

ప్రస్తుత టీటీడీ చట్టం ప్రకారం, పాలకమండలి సభ్యులను ప్రభుత్వం నియమిస్తోంది. దీనివల్ల అధికార పార్టీకి చెందిన నాయకులు, వ్యాపారవేత్తలు బోర్డులో చోటు సంపాదిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కానీ స్వర్ణ దేవాలయ తరహా చట్టం అమలులోకి వస్తే, టీటీడీ బోర్డు సభ్యులు ఎన్నికల ద్వారా లేదా నిర్ణీత అర్హతలు ఉన్న ఆధ్యాత్మిక వేత్తల ద్వారా ఎంపికయ్యే అవకాశం ఉంటుంది. దీనివల్ల రాజకీయ ఒత్తిళ్లకు తావుండదు. పారదర్శకత పెరుగుతుంది.

### - నిధుల వినియోగం - పారదర్శకత

స్వర్ణ దేవాలయ కమిటీ తన నిధులను కేవలం విద్య, వైద్యం, మత ప్రచారానికి మాత్రమే ఉపయోగిస్తుంది. నిధుల వ్యయంపై కఠినమైన ఆడిటింగ్ ఉంటుంది. తిరుమలలో కూడా భక్తులు సమర్పించే కానుకలు ఇతర ప్రభుత్వ అవసరాలకు కాకుండా, కేవలం ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాలకు , సనాతన ధర్మ ప్రచారానికే వాడేలా కఠిన నిబంధనలు ఈ కొత్త చట్టంలో చేర్చే అవకాశం ఉంది. ఇది టీటీడీ ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేస్తుంది.

### - నిపుణుల కమిటీ కసరత్తు

స్వర్ణ దేవాలయ చట్టం ఏపీలో అమలు చేయడానికి ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ప్రభుత్వం న్యాయ నిపుణులు , ఆధ్యాత్మికవేత్తలతో కూడిన కమిటీని నియమించే ఆలోచనలో ఉంది. వివిధ రాష్ట్రాల్లోని ప్రధాన ఆలయాల నిర్వహణ విధానాలను అధ్యయనం చేసిన తర్వాత, ఏపీ కేబినెట్ దీనిపై తుది నిర్ణయం తీసుకుంటుంది. దేవాలయం పట్ల అచంచలమైన భక్తి, నిబద్ధత ఉన్నవారే బోర్డులో ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

కేవలం పరిపాలన మార్పులకే పరిమితం కాకుండా, లడ్డూ తయారీలో వాడే ముడి పదార్థాల సేకరణ నుండి దర్శనం వరకు ప్రతి స్థాయిలోనూ ఉన్నత ప్రమాణాలను నెలకొల్పడం దీని ప్రధాన ఉద్దేశం. ఈ చట్టం ఆచరణలోకి వస్తే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ దేవాలయాలకు తిరుమల ఒక ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# హైదరాబాద్ మెట్రో స్వాధీనానికి తెలంగాణ కేబినెట్ ఓకే

ఈ అడ్డంకిని తొలగించడంతో పాటు, భవిష్యత్తులో మెట్రోను లాభదాయకంగా మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ స్వాధీన ప్రక్రియలో భాగంగా ఎల్ అండ్ టీ సంస్థకు సంబంధించి సుమారు రూ.13,000 కోట్ల రుణాలను ప్రభుత్వం స్వీకరించనుంది. అలాగే ఆ సంస్థ పెట్టిన పెట్టుబడికి ప్రతిఫలంగా సుమారు రూ.2,000 కోట్లను వన్-టైమ్ సెటిల్‌మెంట్ కింద చెల్లించేందుకు ఒప్పందం కుదిరింది.

దీనివల్ల హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ పూర్తి ప్రభుత్వ రంగ సంస్థగా మారి, విదేశీ ఆర్థిక సంస్థల నుంచి తక్కువ వడ్డీకి రుణాలు పొందేందుకు మార్గం సుగమం అవుతుంది. కేవలం రవాణా వ్యవస్థగానే కాకుండా, మెట్రో ఆస్తుల వినియోగం ద్వారా ఆదాయం పెంచుకునేలా కొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మెట్రో నిర్ణయంతో పాటు, కేబినెట్ మరికొన్ని కీలక అభివృద్ధి పనులకు పచ్చజెండా ఊపింది. ముఖ్యంగా మూసి నది పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా నిర్వాసితులకు అందజేసే నష్టపరిహారం, పునరావాస ప్యాకేజీలపై సుదీర్ఘంగా చర్చించారు.

# నా పేరుతో ఎలాంటి సంస్థలకు అనుమతి లేదు

### - కేటీఆర్ పేరును దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలు

ఈ తరహా ప్రకటన వెనుక కేటీఆర్ ఒక స్పష్టమైన రాజకీయ వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు కనిపిస్తోంది. సాధారణంగా ఒక నాయకుడి పేరుతో విడివిడిగా సంస్థలు ఏర్పడినప్పుడు, అవి కాలక్రమేణా పార్టీ కి సమాంతర శక్తులుగా మారే ప్రమాదం ఉంటుంది. అలాగే, ఈ అనధికారిక సంస్థల పేరుతో ఎవరైనా అక్రమాలకు లేదా వివాదాస్పద పనులకు పాల్పడితే, ఆ మచ్చ నేరుగా నాయకుడికే తగులుతుంది. గతంలో పలువురు రాజకీయ నేతల విషయంలో ఇలాంటి చేదు అనుభవాలు ఎదురైనందున, కేటీఆర్ ముందస్తుగా జాగ్రత్త పడి ఇలాంటి సమాంతర వ్యవస్థల ను ఆదిలోనే నియంత్రించాలని భావిస్తున్నారు.

### - అందరూ పార్టీ కోసమే పని చేసేలా చూసే ప్రయత్నం

పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత శ్రేణులను ఒకే గొడుగు కిందకు తీసుకురావడం బీఆర్ఎస్‌కు అత్యవసరం. నాయకుల వ్యక్తిగత ఇమేజ్ కంటే పార్టీ వ్యవస్థే బలమైనదని నిరూపించడానికే కేటీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీ లోపల క్రమశిక్షణను కాపాడటంతో పాటు, క్యాడర్ అంతా కేవలం బీఆర్ఎస్ జెండా కిందనే పనిచేసేలా చూడటం దీని ప్రధాన ఉద్దేశం. ఇలా చేయడం వల్ల పార్టీలో గ్రూపు రాజకీయాలకు తావుండదని, కార్యకర్తల శక్తి సామర్థ్యాలు కేవలం పార్టీ ప్రయోజనాలకే ఉపయోగపడతాయని ఆయన భావిస్తున్నారు.

### - ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టిన బీఆర్ఎస్ టీం

సోషల్ మీడియాలో కూడా ఈ అంశంపై చర్చ జరుగుతోంది. కేటీఆర్ తన పేరును వాడుకుని కొందరు సొంత లాభం కోసం ప్రయత్నిస్తున్నారనే సమాచారంతోనే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. తన అనుమతి లేకుండా తన పేరును, ఫోటోలను వాడుకుంటూ సంస్థలు నడిపేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం కూడా లేకపోలేదు. అభిమానాన్ని పార్టీ విధేయతగా మార్చుకోవాలన్న కేటీఆర్ పిలుపుతో ఇప్పుడు బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త చర్చ మొదలైంది.

# కల్తీ పాల ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్

ఘటనలోని బాధితులు వాంతులు, కడుపునొప్పి, డయాలసిస్ సమస్యతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. క్లీనికల్ పరీక్షల్లో రక్తంలో యూరియా, సీరమ్ క్రియాటినిన్ స్థాయి పెరిగినట్లు వైద్యులు గుర్తించారు. కోరుకొండ మండలం, నరసాపురం గ్రామంలో వరలక్ష్మీ మిల్క్ డెయిరీ 106 కుటుంబాలకు రోజూ పాల సరఫరా చేస్తోంది. ఈ డెయిరీ నుంచి వచ్చిన పాలను తాగి అనారోగ్యం పాలయ్యారని అధికారులు నిర్ధారించారు. ఈ ఘటనలో నలుగురు చనిపోయారు. ఇద్దరు వెంటిలేటర్‌పై ఉన్నారు. మరో 8 మంది చికిత్స పొందుతున్నారు. మృతుల్లో ముగ్గురు 70 ఏళ్లకు పైబడిన వారు, ఒకరు 58 ఏళ్ల వయసు వారు ఉన్నారు. బాధితుల నుంచి నమూనాలను తీసుకుని హైదరాబాద్, విశాఖపట్నం ల్యాబ్స్‌కు పరీక్షల కోసం పంపించాం. డెయిరీ నిర్వాహకుడు అద్దాల గణేశ్వరరావును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. కాసులకు కక్కుర్తి పడి ఈ కల్తీ వ్యవహారానికి పాల్పడితే సీరియస్‌గా తీసుకుంటాం. విచారణ అనంతరం దోషులపై చర్యలు తీసకుంటాం. రాష్ట్రంలో ఎవరైనా కల్తీకి పాల్పడినా, ప్రజలకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించినా ప్రభుత్వం ఉదాసీనంగా ఉండదు అత్యంత కఠినంగా వ్యవహరిస్తాం' అని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

### - అసెంబ్లీలోని ఛాంబర్‌లో సమీక్ష

రాజమహేంద్రవరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్ ప్రాంతాల్లో పాల వినియోగంతో స్థానికులు అస్వస్థతకు గురవడం, పలువురు మరణించారన్న ఘటన తెలియగానే ఉదయమే ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, వైద్యారోగ్య శాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారులతో సమీక్షించి ఘటనకు గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అందుతున్న వైద్యసాయంపై ఆరా తీశారు. చికిత్స పొందుతున్న వారికి అత్యుత్తమ వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. పాలు వినియోగించిన కుటుంబాల్లోని 75 మంది నుంచి శాంపిల్స్ సేకరించామని, మిగిలిన వారందరి నుంచి కూడా నమూనాలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఫుడ్ సేఫ్టీ, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు తక్షణమే రాజమహేంద్రవరం వెళ్లి పరిస్థితిని పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. ఈ ఘటనపై మరోసారి అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మంత్రులు, అధికారులతో మధ్యాహ్నం సీఎం చంద్రబాబు సమీక్షించారు.

# ఒక్క గజం భూమిని ఆక్రమించినట్టు నిరూపిస్తే పదవి వదులుకుంటా

కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తీవ్రంగా ఖండించారు. తాను అవినీతికి పాల్పడినట్లు ఆధారాలతో సహా నిరూపిస్తే, తక్షణమే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీకి బహిరంగ సవాల్ విసిరారు. ఈ వివాదంపై పూర్తి వాస్తవాలను బయటపెట్టాలని కోరుతూ ఆయన కామారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి, కళాశాల భూములకు సంబంధించిన పూర్తి వివరాలను అందజేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన వెంకటరమణారెడ్డి షబ్బీర్ అలీ తన రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సత్యదూరమైన విషయాలను ప్రచారం చేస్తూ విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. డిగ్రీ కళాశాల భూముల వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు ఇప్పటికే తాము ఆర్టీఐ ద్వారా దరఖాస్తు చేశామని, ప్రభుత్వం నుంచి సమాచారం రాగానే అన్ని విషయాలు బహిర్గతం అవుతాయని స్పష్టం చేశారు. "కాలేజీ భూముల విషయంలో నేను ఒక్క గజం భూమినైనా ఆక్రమించినట్లు లేదా అవినీతి చేసినట్లు నిరూపించినా పదవి వదులుకోవడానికి సిద్ధం" అని ఆయన సవాల్ విసిరారు. జిల్లాలో శాంతిభద్రతల సమస్య తలెత్తకూడదనే ఉద్దేశంతోనే తాను ఇప్పటివరకు ఓపికతో ఉన్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పోలీసుల తీరుపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను కలవడానికి వస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకులను పోలీసులు అడ్డుకుంటున్నారని, ఇదే నిబంధన కాంగ్రెస్ నాయకులకు ఎందుకు వర్తించడం లేదని ఆయన ప్రశ్నించారు. చట్టం అందరికీ ఒకేలా ఉండాలని డిమాండ్ చేశారు. త్వరలోనే ఈ భూముల వ్యవహారంలో పక్కా ఆధారాలతో నిజాలను ప్రజల ముందు ఉంచుతామని, అప్పటి వరకు అబద్ధపు ప్రచారాలను నమ్మవద్దని ఆయన కోరారు.

# స్టాలిన్ కు, నాకు మధ్యనే ప్రత్యక్ష పోరు


మధ్య ప్రజలకు, డీఎంకే ప్రభుత్వానికి మధ్య జరుగుతున్న యుద్ధం" అని విజయ్ అన్నారు. ఓటు తమ హక్కు అని, దానిని ఎవరూ కొనలేరని ఆయన స్పష్టం చేశారు.తమిళనాడు రాజకీయ పరిస్థితిని వివరిస్తూ ఆయన ఓ జల్లికట్టు ఎద్దు కథను ఉదాహరణగా చెప్పారు. "ఆ కథలో ఎద్దు తమిళనాడు రాజకీయ పరిస్థితికి ప్రతీక. దానితో పోరాడే అబ్బాయి కేవలం నేను కాదు, మనమందరం. మార్పు కోసం ప్రజలు ఆకలితో ఉన్నప్పుడు వారికి పరిష్కారాలు కావాలి కానీ భయం కాదు" అని వివరించారు. నెలవారీ కరెంట్ బిల్లుల హామీ ఏమైందని విజయ్ డీఎంకే ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శాంతిభద్రతలు, మహిళల భద్రత, కొండ గ్రామాల్లో బస్సు సౌకర్యాల కొరత, వైద్య సదుపాయాలు లేకపోవడం వంటి అంశాలను కూడా ఆయన ప్రస్తావించారు. తమ ప్రభుత్వంలో అమ్మాయిలు, అబ్బాయిల భద్రతకు తొలి ప్రాధాన్యత ఇస్తామని, ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.రాజకీయాల్లోకి రాకముందు, వచ్చిన తర్వాత తమ ఆస్తుల వివరాలను నేతలు ప్రకటించాలని ఆయన సవాల్ విసిరారు. తనను 'స్నేహితుడు' అని స్టాలిన్ గతంలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ "నేనే మీ స్నేహితుడినైతే వివాదాల్లోకి నా పేరు ఎందుకు లాగుతున్నారు?" అని ప్రశ్నించారు. అవినీతిని వ్యతిరేకిస్తున్నందుకే అందరూ తనను టార్గెట్ చేస్తున్నారని, ప్రతి పోలింగ్ బూత్ విజయం సాధించే బూత్‌గా మారాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి క్యూఆర్ కోడ్ పాసులు ఉన్న 4,900 మందిని మాత్రమే అనుమతించారు.

# జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం

ఎమ్మెల్యే రాజీనామా చేయాలని సవాల్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ తనను సస్పెండ్ చేస్తే ఆ మరుక్షణం తాను ఆ పార్టీ నుంచి వచ్చిన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని గుర్తు చేశారు. రాజకీయాల్లో నీతి, నిజాయతీ, ధైర్యం ఉండాలని వ్యాఖ్యానించారు. మన ప్రాంతం నుంచే నీళ్లు పోతున్నాయి కానీ మనకు మాత్రం అందడం లేదని అన్నారు.నడిగడ్డ ప్రాంతానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేసిందేమీ లేదని అన్నారు. ప్రభుత్వంలో ఎవరున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చేలా ప్రభుత్వాలతో పని చేయించడం కోసమే కొత్త పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎవరు ఏమిచ్చినా తీసుకోవాలని, కానీ పని చేసేవారికి ఓటు వేయాలని సూచించారు. త్వరలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు వస్తున్నాయని, అప్పుడు డబ్బులు ఇచ్చినా తీసుకోవాలని, కానీ మీకోసం కొట్లాడే జాగృతి అభ్యర్థులకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఆడబిడ్డలకు నెలకు రూ.2,500, తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికలకు ముందు చెప్పిందని గుర్తు చేశారు. కానీ ఈ హామీలు ఇప్పటి వరకు నెరవేర్చలేదని అన్నారు.

# తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతం

### - పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణలో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు జనసేన తెలంగాణ విభాగం ప్రకటన విడుదల చేసింది. సభ్యత్వ నమోదు కార్యక్రమం కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. జనసేన పార్టీ 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 26వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా నిర్వహించాలని పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో పార్టీని 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో బలంగా తీసుకెళ్లి, సంస్థాగతంగా బలోపేతం చేయడానికి జిల్లాలవారీగా కొంతమంది నాయకులకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలను అప్పగించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నూతనంగా ఏర్పడిన మూడు కార్పొరేషన్‌లకు వేర్వేరు ఇన్‌ఛార్జులను నియమించారు. జనసేన పార్టీ ఉపాధ్యక్షులు బొంగునూరి మహేందర్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్, పార్టీ నాయకులు రాధారాం రాజలింగం, కావ్య మండపాక, శిరీష పొన్నూరి రాష్ట్రస్థాయిలో పర్యవేక్షిస్తారని ఆ ప్రకటనలో జనసేన పార్టీ తెలిపింది. ఆయా పార్లమెంట్ పరిధిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాల బాధ్యతను రసువుకు నాయకులకు అప్పగించారు.

# సుప్రీంకోర్టు తీర్పును అలుసుగా తీసుకుంటే ఊరుకునేది లేదు

### - ట్రంప్ హెచ్చరిక



న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) వివిధ దేశాలపై డొనాల్డ్ ట్రంప్ విధించిన అదనపు సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు తప్పుబట్టిన విషయం తెలిసిందే. అమెరికా కాంగ్రెస్ అనుమతి లేకుండా వేసిన ఈ సుంకాలు చెల్లవని తీర్పు వెలువరించింది. ఈ తీర్పుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పందించారు. సుప్రీంకోర్టు తీర్పును అలుసుగా తీసుకుని ఏ దేశమైనా ఆటలాడాలని చూస్తే భారీ టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఈ తీర్పు ద్వారా తెలియకుండానే తనకు మరిన్ని అధికారాలు కట్టబెట్టిందని వ్యాఖ్యానించారు. కొన్ని దేశాలు అమెరికాను దశాబ్దాలుగా కొల్లగొట్టాయని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పును ఆధారంగా చేసుకుని, ఇష్టానుసారం వ్యవహరించాలని చూస్తే ఇటీవల అంగీకరించిన సుంకాల కంటే భారీగా ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన తన ట్రూత్ సోషల్ మీడియాలో ఈ హెచ్చరిక జారీ చేశారు. అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టంను ఉపయోగించి డొనాల్డ్ ట్రంప్ తన మాట వినని వివిధ దేశాలపై అధిక పన్ను విధించారు. ట్రంప్ అధిక సుంకాలకు అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేదు. టారిఫ్ అంశం సుప్రీంకోర్టుకు వెళ్లగా, ట్రంప్ తీరును తప్పుబట్టింది. ఆయన నిర్ణయానికి వ్యతిరేకంగా తీర్పు వెలువరించింది.

# డేటా షేరింగ్‌పై దిగొచ్చిన వాట్సాప్

### - సుప్రీంకోర్టులో కీలక హామీ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) యూజర్ల డేటా గోప్యత విషయంలో మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇతర మెటా కంపెనీలతో తమ డేటాను పంచుకునే విషయంలో యూజర్లకు మరింత నియంత్రణ కల్పించాలన్న కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆదేశాలకు కట్టుబడి ఉంటామని సోమవారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ఈ మేరకు కోర్టుకు హామీ ఇవ్వడంతో, సీసీఐ జరిమానాను సవాలు చేస్తూ దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్లను వాట్సాప్, దాని మాతృసంస్థ మెటా వెనక్కి తీసుకున్నాయి. సోమవారం ఈ కేసు విచారణ సందర్భంగా వాట్సాప్, మెటా తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. "మేము ఇప్పుడు స్టే కోరడం లేదు. ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటున్నాం" అని ఆయన కోర్టుకు తెలిపారు. నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) జారీ చేసిన ఆదేశాలను మార్చి 16 నాటికి అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ వాదనలను నమోదు చేసుకున్న ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, మధ్యంతర పిటిషన్లను కొట్టివేసింది.

వాట్సాప్ 2021 ప్రైవసీ పాలసీ ద్వారా యూజర్లపై అన్యాయమైన షరతులు విధిస్తోందని, తద్వారా మెటా తన మార్కెట్ ఆధిపత్యాన్ని బలోపేతం చేసుకుంటోందని సీసీఐ గతంలో నిర్ధారించింది. ఈ నిర్ణయాన్ని ఎన్‌సీఎల్ఏటీ సమర్థించింది. అయితే, యూజర్లకు డేటా షేరింగ్‌పై స్పష్టమైన ఆప్ట్-ఇన్, ఆప్ట్-అవుట్ సౌకర్యాలు కల్పిస్తే సరిపోతుందని, పూర్తిస్థాయి నిషేధం అవసరం లేదని సూచించింది. ఈ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు గతంలో వాట్సాప్ ప్రైవసీ పాలసీపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఇది "అంగీకరించు లేదా వైదొలగు" పద్ధతిలో ఉందని, భారతీయ యూజర్ల గోప్యతా హక్కుతో ఆడుకోవడానికి వీల్లేదని ఘాటుగా వ్యాఖ్యానించింది. ప్రస్తుతం వాట్సాప్ మధ్యంతర పిటిషన్లను ఉపసంహరించుకున్నప్పటికీ, 2021 ప్రైవసీ పాలసీ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన ప్రధాన అప్పీల్ సుప్రీంకోర్టులో పెండింగ్‌లోనే ఉంది.

# గిరిజన సాధికారతే ఎన్డీయే కూటమి లక్ష్యం.




శ్రీకాళహస్తి( ప్రశ్న న్యూస్) గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం నుంచి కోలుకుని 20 నెలల్లోనే గణనీయమైన ప్రగతిని సాధిస్తున్న చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం తోనే గిరిజన సాధికారత సాధ్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యుడు యం.సుబ్బయ్య పేర్కొన్నారు.ఈరోజు శ్రీకాళహస్తి పట్టణం, లోబావి భరద్వాజ తీర్థం లోని యస్టీ కాలనీలో ఉన్న గిరిజన నాయకులతో కలిసి బడ్జెట్ పై అవగాహనా కార్యక్రమం నిర్వహించి మాట్లాడటం జరిగింది.2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్టీ కాంపోనెంట్ కోసం రూ. 9,190 కోట్లు కేటాయించిన కూటమి ప్రభుత్వం గిరిజన అభివృద్ధికి, సంక్షేమానికి అంకితభావంతో కృషిచేస్తోందని తెలిపారు. ఎస్టీలు నిర్మించుకునే ఇళ్ల నిర్మాణానికి వారి పై ఆర్థిక భారం పడకుండా అదనంగా రూ. 75,000 రూపాయలు ఇస్తుండటం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అని కొనియాడారు.ఎస్టీల వసతి గృహాలు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, అనుసంధాన రహదారుల కోసం బడ్జెట్ లో రూ.100 కోట్ల రూపాయలను కూటమి ప్రభుత్వం కేటాయించిందని.

అలాగే రూ.15 కోట్లతో గిరిజన స్వాతంత్ర్య సమర యోధుల మ్యూజియం ఏర్పాటు, రాష్ట్రంలో ఉన్న 9 ఐటీడీఏల నిర్వహణకు రూ: 28.63 కోట్లు బడ్జెట్‌లో నిధులు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎస్ టి విద్యార్థుల భవిష్యత్తు కోసం 4.22 కోట్ల వ్యయంతో ఖూజ కోచింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని, అందుకు విజయవాడ, తిరుపతి మరియు విశాఖపట్నం కేంద్రాలుగా 3 రీజియన్లలో ఉచిత యు పి ఎస్ సి కోచింగ్ సెంటర్ల ఏర్పాటు చేయడం ద్వారా ఎస్ టి విద్యార్థులు సివిల్ సర్వీసుల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు యం.సుబ్బయ్య, వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, కన్నయ్య, సుబ్రహ్మణ్యం, నాగ, పూర్ణ, చెంగమ్మ, గంగమ్మ, లక్ష్మమ్మ, రత్నమ్మ, లక్ష్మి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# రొండా మల్లారెడ్డి దశదినకర్మకు హాజరైన ఎమ్మెల్యే శ్రీ గణేష్



మేడ్చల్( ప్రశ్న న్యూస్ )సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పూడూరు- కిష్టపూర్ డివిజన్ పరిధిలోని పూడూరు గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, హరిహర నందన అయ్యప్ప స్వామి దేవాలయ ధర్మకర్త రొండా మల్లారెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే.కాగా సోమవారం పూడూరు గ్రామంలోని వారి నివాసంలో నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ హాజరై ఆర్.మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

గతంలో కాంగ్రెస్ పార్టీ కంటోన్మెంట్ లీడర్షిప్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఇంచార్జీగా ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి విశేషంగా సేవలు అందించారని తెలిపారు. తనకు మల్లారెడ్డితో ప్రత్యేకమైన అనుబంధం ఉందని తన ఎదుగుదలకు మల్లారెడ్డి సహకారం మరిచిపోలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, దేవర యంజాల్ సీతారామచంద్రస్వామి ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ ఎన్.నర్సింహా రెడ్డి, మాజీ వార్డు సభ్యులు శేఖర్ రెడ్డి, మల్లెల కృష్ణ, కోలా వెంకటేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లంపేట పురపాలక సంఘం చైర్మెన్ ను సన్మానించిన అప్పమ్మగారి జగన్ రెడ్డి




మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) ఎల్లంపేట పురపాలక సంఘం చైర్మన్ గా సోమవారం బాధ్యతలు స్వీకరించిన శ్రీదేవి, వైస్ చైర్మెన్ రజిత రెడ్డి, కౌన్సిలర్లను గౌడవెల్లి మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అప్పమ్మగారి జగన్ రెడ్డి సోమవారం శాలువ కప్పిన అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే మల్లారెడ్డి చిత్తశుద్ధితో నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషితోనే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించిందన్నారు. కేసీఆర్, మల్లారెడ్డి చూపిన బాటలో పురపాలక సంఘం పరిధిలో పారిశుధ్య పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నూతన పాలకవర్గ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గౌడవెల్లి గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు గోమారం శ్రీనివాస్ రెడ్డి, అప్పమ్మ గారి రాజగోపాల్ రెడ్డి మరియు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి ఫిర్యాదులు సమస్యలు తీరుస్తున్నారా.?



నిజామాబాద్(ప్రశ్న న్యూస్) ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 107 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దళిత ద్రోహి జగన్ - అతని ఐదేళ్ల పాలనలో దళితుల ఊచకోత

## పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య.



మంగళగిరి (ప్రశ్న న్యూస్ ) దళిత ద్రోహి జగన్, అతని ఐదేళ్ల పాలనలో దళితుల ఊచకోత కోసారని పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. సోమవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ' జగన్ రెడ్డి ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించాడు. ఆయన ఐదేళ్ల పాలనలో దళిత వ్యతిరేకిగా ముద్ర పడ్డాడు. దళిత ద్రోహిగా తనని తానే రుజువు చేసుకున్నాడు. దళితులు మాకు మేనమామలు మాకు బంధుత్వం ఉందని చెప్పి.. పదేపదే చెప్తు ఉంటాడు. అదంతా కూడా అబద్ధమే. ఆయన బంధువుల అభివృద్ధికి ఎప్పుడూ కూడా కాంక్షించలేదు దళితులను ఊచకోత కోసిన వ్యక్తి జగన్ రెడ్డి. జగన్ రెడ్డి పాలనలో దళితులు అనేక ఇబ్బందులకు గురై చాలా బాధలు పడ్డారు. అనంతబాబు ఒక దళితుడిని చంపి శవాన్ని డోర్ డెలివరి చేసిన కేసులో ఖాకీ ఖద్దర్ రెండు కుమ్మక్కైయ్యాయని నిన్న కాక మొన్న సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. దీని వల్ల దళితులకు అన్యాయం జరిగింది. కేసు సజావుగా సాగలేదు. కేసు దర్యాప్తు నానా విధాలుగా నడిచింది. బాధ్యుల మీద చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. సుప్రీం కోర్టు వ్యాఖ్యలు చూసిన తరువాత దళితులు మీకు ఎలా బంధువులు జగన్ రెడ్డి దళితులు ఏ రకంగా మేనమామలు జగన్ రెడ్డి జగన్ రెడ్డి దళితులను అసహించుకున్నారు. దళితులను వేటాడి. వెంటాడి.. బలి తీసుకున్నారు. అనంతబాబు దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసి బతికి ఉంటే అసుపత్రికి తీసుకువెళ్లండి చస్తే స్మశానానికి తీసుకువెళ్లండి" అని అహంకారంలో మాట్లాడాడు.

# ఖైదీలకు క్షమాభిక్షపై ప్రభుత్వం సానుకూలం

## హోం మంత్రి వంగలపూడి అనిత



అమరావతి(ప్రశ్న న్యూస్) జైలులోని ఖైదీలకు క్షమాభిక్ష విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. సోమవారం 8వ రోజు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జైళ్లు, సంస్కరణల చట్టం సవరణపై బిల్లును అసెంబ్లీలో హోంమంత్రి అనిత ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ ఖైదీల సంస్కరణల కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కేంద్రం తెచ్చిన చట్టం మేరకు ఇక్కడ కూడా సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. ఖైదీలు జైలులో ఉండి చదువుకునేలా అవకాశాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ఖైదీల్లో పరివర్తన తీసుకురావటం కోసం చట్టంలో మార్పులు తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా ఖైదీల పిల్లల కోసం జైలులో ప్రత్యేకంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఖైదీల నేరచరిత్ర, ప్రవర్తన ఆధారంగా కేటగిరీలుగా విభజిస్తామని పేర్కొన్నారు. ఖైదీలు మారేందుకు, మానసిక పరివర్తన తెచ్చేలా ఓపెన్ ఎయిర్ జైళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఖైదీలు.. వ్యవసాయంతో పాటు ఇతర వృత్తులు నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు.

# కొత్త నియామకాల ద్వారా రెవెన్యూ వ్యవస్థ బలోపేతం

## 31 మంది జూనియర్ అసిసెంట్లకు నియామక పత్రాలు అందించిన మంత్రి అనగాని



అమరావతి(ప్రశ్న న్యూస్ )ప్రజలకు నిరంతం సేవలందించే రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా కొత్తగా సిబ్బందిని నియామకం చేస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా సీసీఎల్ఎ ప్రధాన కార్యాలయంలో పని చేసేందుకు కొత్తగా 31 మంది జూనియర్ అసిస్టెంట్లకు తన చేతుల మీదుగా మంత్రి అనగాని సత్యప్రసాద్ నియామక పత్రాలు అందజేశారు. అందరూ కష్టపడి పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. రానున్న కాలంలో రెవెన్యూ శాఖ చేయాల్సిన పని చాలా ఉందని, మీరంతా చిత్తశుద్ధితో కష్టపడి పని చేయాలని కోరారు. వీరితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పని చేసేందుకు 114 మంది డిప్యూటీ తహశీల్దార్లను కూడా నియామకం చేసినట్లు చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి ఇంటి స్థలాల కేటాయింపు, రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, వరదలు, తుఫానుల వంటి సమయాల్లో తక్షణ సహాయం, కుల, ఆదాయ, నివాస ధ్రువ పత్రాల జారీ, పరిశ్రమలు, ప్రభుత్వ ప్రాజెక్టులకు భూముల సేకరణ లాంటి కీలక పనుల్లో అందరూ నిజాయితీగా పని చేయాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ కోరారు. నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీసీఎల్ఎ జయలక్ష్మీ పాల్గొన్నారు

# జనగణన శిక్షణకు అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల(ప్రశ్న న్యూస్)జిల్లాలో నిర్వహించనున్న జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ నెల 24, 25, 26 తేదీలలో మూడు రోజులపాటు జిల్లా స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో జనగణన శిక్షణ కార్యక్రమంపై కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, శిక్షణ కార్యక్రమానికి సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరై, అందించే మార్గదర్శకాలను పూర్తిగా అవగాహన చేసుకోవాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమం అయ్యలూరు మెట్టలోని ఎస్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించబడుతుందని, ప్రతిరోజూ ఉదయం 9.00 గంటలకల్లా హాజరు కావాలని స్పష్టం చేశారు. అధికారులకు ఎటువంటి సెలవులు లేదా మినహాయింపులు అనుమతించబడవని తెలిపారు. జిల్లా కలెక్టర్ (ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్), జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సబ్ డివిజనల్ స్థాయి ఆర్డీఓలు, సబ్ కలెక్టర్లు, మండల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, డిప్యూటీ తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ శిక్షణకు హాజరుకావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మొత్తం 164 మంది అధికారులను మూడు బ్యాచ్‌లుగా విభజించి, పూర్తి స్థాయి ఆన్‌లైన్ మరియు హ్యాండ్స్-ఆన్ విధానంలో శిక్షణ అందించనున్నట్లు కలెక్టర్ వివరించారు. ముఖ్యంగా సిఎంఎంఎస్ యాప్ ద్వారా ఎన్యుమరేటర్లకు ఆర్డర్లు జారీ చేయడం, బ్లాక్‌ల విభజన, డేటా నమోదు విధానం వంటి కీలక అంశాలపై రాష్ట్ర స్థాయి బృందం ప్రత్యక్షంగా శిక్షణ అందించనుందని కలెక్టర్ తెలిపారు.జనగణన వంటి జాతీయ ప్రాధాన్యత కలిగిన కార్యక్రమం విజయవంతం కావాలంటే అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, శిక్షణలో చురుకుగా పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు

# పౌరసరఫరాల సేవల్లో సంస్కరణ బాట

## మంత్రి నాదెండ్ల మనోహర్



అమరావతి(ప్రశ్న న్యూస్ )పౌరసరఫరాల సేవలను ఆదర్శవంతంగా ప్రజలకు అందజేయడమే కాకుండా, సేవల్లో గణనీయమైన సంస్కరణలను కూటమి ప్రభుత్వం తీసుకు వచ్చిందని ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖ పనితీరుపై శాసనసభలో సభ్యులు లేవనెత్తిన చర్చ సందర్భంగా మనోహర్ సమాధానం ఇస్తూ శాఖ పనితీరును వివరించారు. అలాగే మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత శాఖలో తీసుకువచ్చిన మార్పులు, సంస్కరణల గురించి ప్రస్తావించారు. వివరాలు ఆయన మాటల్లో గతంలో మాదిరి కాకుండా రాష్ట్రంలో ఉన్న 1.45 రేషన్ కార్డుల లబ్ధిదారులకు సకాలంలో సేవలు అందిస్తున్నాం. ఏటీఎం తరహాలో స్మార్ట్ రేషన్ కార్డు తీసుకువచ్చాం. క్యూఆర్ కోడ్ ద్వారా లబ్ధిదారుల సమస్త వివరాలు, సరకులు తీసుకున్న రికార్డు దానిలో పొందుపరుస్తున్నాం. ప్రతి నెల ఒకటో తారీఖు కన్నా ముందే వికలాంగులు, వృద్ధులు ఉన్న 16.35 లక్షల కార్డులకు ఇంటింటికి వెళ్లి పౌరసరఫరాల సేవలను అందిస్తున్నాం. భావితరాలకు పోషకాలతో కూడిన ఆహారం అందించాలనే లక్ష్యంతో మధ్యాహ్న భోజనం కింద పంపుతున్న బియ్యాన్ని 25 కేజీల బస్తాల్లో, నాణ్యమైన బియ్యాన్ని పంపుతున్నాం అని తెలిపారు.

మహిళల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యమిస్తూ ప్రతి తెల్ల కార్డు ఉన్న కుటుంబానికి ఉచితంగా నాలుగు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నాం.ఇలా ఎన్నెన్నో వినూత్న సంస్కరణలను పౌరసరఫరాల శాఖలో తీసుకొచ్చాం. ప్రజల ఆహార భద్రతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చాం ఈ సందర్భంగా తెలిపారు.

## ఎంఆర్‌కేఆర్ కంపెనీలో చోరీ కేసు ఛేదన

- రూ.1 లక్ష విలువైన ఇనుప సామగ్రి స్వాధీనం
- గంభీరావుపేట సబ్ ఇన్స్పెక్టర్ : అనిల్ కుమార్



గంభీరావుపేట (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట మండలం,నాగంపేటలోని ఎంఆర్‌కేఆర్ కంపెనీ ప్రాంగణంలో జరిగిన ఇనుప సామగ్రి చోరీ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. కంపెనీ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన గంభీరావుపేట ఎస్సై అనిల్ కుమార్ నేతృత్వంలో పోలీసులు ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ చేసిన వారిలో కార్తిక్ రెడ్డి, మాధవ్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, పంగ బాలకృష్ణ, సయ్యద్ అల్తాఫ్, మనోహర్ రెడ్డి ఉన్నారు. వీరు కంపెనీ ప్రాంగణంలో నిల్వ ఉంచిన పైపులు, తలుపులు తదితర ఇనుప సామగ్రిని అపహరించినట్లు ఎస్సై వెల్లడించారు.నిందితుల వద్ద నుంచి సుమారు రూ.1 లక్ష విలువైన ఇనుప సామగ్రితో పాటు చోరీకి వినియోగించిన ట్రాక్టర్, బైక్, గ్యాస్ కట్టర్లు స్వాధీనం చేసుకున్నట్లు, ఈ కేసులో నిందితులను కోర్టులో హాజరుపరచగా, తదుపరి విచారణ కొనసాగుతున్నట్లు ఎస్సై అనిల్ కుమార్ వెల్లడించారు.

## వేములవాడలో అక్రమ మద్యం స్వాధీనం

- అక్రమంగా మద్యం నిల్వ ఉంచినా,రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవు
- వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ : వీరప్రసాద్



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలో పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో భారీ మొత్తంలో అక్రమ మద్యం పట్టుబడింది. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ దాడుల్లో శాస్త్రి నగర్‌కు చెందిన కోల మారుతి అనే వ్యక్తి అక్రమంగా మద్యం నిల్వ ఉంచినట్లు పోలీసులు గుర్తించారు.వేములవాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వీర ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం, విశ్వసనీయ సమాచారం ఆధారంగా పోలీసులు దాడులు నిర్వహించగా వివిధ రకాల బ్రాండ్లకు చెందిన మొత్తం 120.4 లీటర్ల మద్యం సీసాలు, టిన్‌లు స్వాధీనం చేసుకున్నామని,స్వాధీనం చేసిన మద్యం విలువ సుమారు రూ. 54,589 ఉంటుందని అధికారులు అంచనా వేశారు.అక్రమంగా మద్యం నిల్వ ఉంచినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీర ప్రసాద్ హెచ్చరించారు. ఈ ఘటనపై నిందితుడిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు,అక్రమ మద్యం కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించాలని ఆయన కోరారు.

## పేదల సొంతింటి కల ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం

- విలాసాగర్ గ్రామ సర్పంచ్ : ఏనుగుల కనుకయ్య
- ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం వేడుకలో కనుకయ్య హాజరు
- లబ్ధిదారుకు శుభాకాంక్షలు - సన్మానం



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు ఒంటరి మహిళ సరవ్వ గృహప్రవేశం వేడుకలో భాగంగా నిర్వహించిన సత్యనారాయణ స్వామి పూజా కార్యక్రమానికి విలాసాగర్ గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఏనుగుల కనుకయ్య హాజరై, శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా కనుకయ్య మాట్లాడుతూ, పేదలకు సొంతింటి కలను నిజం చేయడం ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిజమైన అర్హులకు ఇళ్లు అందుతున్నాయని, గ్రామాల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరేలా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. లబ్ధిదారు సరవ్వ కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, కొత్త ఇంట్లో ఆనందంగా, సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మోత్కురావుపేట లో పులి పాదముద్రలు గుర్తింపు

## - అధికారులతో విప్ ఆది సమీక్ష

పెద్దపులి కదలికలతో స్థానికుల్లో భయం - భద్రతా చర్యలు ముమ్మరం



చందుర్తి / వేములవాడ (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, చందుర్తి–మోత్కూరావుపేట అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తుందనే సమాచారంతో సోమవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అటవీ శాఖ అధికారులను సంప్రదించి వివరాలు తెలుసుకున్నారు. ఇటీవల మోత్కూరావుపేట (చందుర్తి--తొర్తి) అటవీ ప్రాంతంలో పెద్దపులి పాదముద్రలు గుర్తించినట్లు అటవీ అధికారులు విప్‌కు తెలియజేశారు. దీంతో స్థానికంగా అప్రమత్తత పెరిగింది. మోత్కూరావుపేట నుంచి చందుర్తి జంగల్ రోడ్డు గుండా ప్రయాణించే వారు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని ఆది శ్రీనివాస్ సూచించారు. గ్రామస్తుల్లో భయం నెలకొన్న నేపథ్యంలో పరిస్థితిని సమీక్షించిన ఆయన, అవసరమైన భద్రతా చర్యలు వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.గ్రామాల సమీపంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రాత్రి వేళల్లో అటవీ ప్రాంతాలకు వెళ్లకూడదని, పశువులను సురక్షిత ప్రదేశాల్లో కట్టివేయాలని ప్రజలకు తెలియజేయాలని ఆయన సూచించారు.అటవీ శాఖ అధికారులు సైతం పులి కదలికలపై నిరంతరం నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు.

# ఓటమి గెలుపుకు నాంది.

- మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్ .నగేష్ - ఘనంగా ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్బాల్ క్రీడోత్సవాలు.

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లా కేంద్రంలోని అవుట్డోర్ స్టేడియం, వెస్లీ క్రీడా మైదానాలలో గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న సెకండ్ ఎడిషన్ సీఎం కప్ 2025 సాఫ్ట్బాల్ రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు ఘనంగా ముగిశాయి. సోమవారం రోజున సాయంత్రం ఔట్డోర్ స్టేడియం, మెదక్ లో రాష్ట్ర స్థాయి క్రీడల ముగింపు కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి సాఫ్ట్బాల్ క్రీడలో గెలుపొందిన క్రీడాకారులకు మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీ ఎం నగేష్,జిల్లా విద్యాధికారి విజయ ముఖ్య అతిథులుగా విచ్చేసి గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి సభాధ్యక్షులుగా రమేష్ గంగాల జిల్లా యువజన మరియు క్రీడల అధికారి వ్యవహరించారు.ముఖ్య అతిథి నగేష్ మాట్లాడుతూ గెలుపు ఓటములు సమానమని ఓడిన వారు నిరుత్సాహ పడకుండా మరింత పట్టుదలతో కష్టపడి క్రీడలలో రాణించేలా కృషి చేయాలని అన్నారు. క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తుందని అన్నారు. నాలుగు రోజులపాటు విజయవంతంగా రాష్ట్రస్థాయి క్రీడలను నిర్వహించిన జిల్లా యువజన మరియు క్రీడల అధికారి రమేష్ గంగాలను అభినందించారు. రాష్ట్రస్థాయి క్రీడలు ఈనెల 20 నుండి 23 వరకు జరిగాయి. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం సుమారు 6 గంటల వరకు క్రీడలను నిర్వహించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలోని 25 జిల్లాల నుండి సుమారుగా 700 మంది క్రీడాకారులు, 30 మంది కోచ్, మేనేజర్లు, 70 మంది వ్యాయామ ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి క్రీడలో పాల్గొనడం జరిగింది. నాలుగు రోజులపాటు కొనసాగిన సాఫ్ట్బాల్ రాష్ట్ర స్థాయి క్రీడలలో పురుషుల విభాగంలో రంగారెడ్డి జిల్లా ప్రథమ స్థానం, హైదరాబాద్ జిల్లా ద్వితీయ స్థానం, జయశంకర్ భూపాలపల్లి తృతీయ స్థానం, మహిళల విభాగంలో నిజామాబాద్ జిల్లా ప్రథమ స్థానం, సిద్దిపేట జిల్లా ద్వితీయ స్థానం, మహబూబ్నగర్ జిల్లా తృతీయ స్థానంలో నిలిచి బహుమతులను అందుకోవడం జరిగింది.కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ రాజిరెడ్డి సాఫ్ట్బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రెటరీ శోభన్ బాబు, సాఫ్ట్బాల్ ఇండియా కోచ్ కృష్ణ, అంతర్జాతీయ క్రీడాకారుడు అభిషేక్ గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు , మెదక్ జిల్లా సాఫ్ట్బాల్ అసోసియేషన్ కార్యదర్శి శ్యాంసుందర్



శర్మ, వ్యాయామ ఉపాధ్యాయులు మాధవరెడ్డి, దేవేందర్ రెడ్డి, చంద్రమోహన్, అశోక్, ప్రభాకర్, మనోహర్, రమేష్, శంకర్, సత్యం, శ్యాం, రవి, సుజాత కుమారి, పద్మ, లతీఫా, కళ్యాణి, విజయకృష్ణ, ప్రతాప్ సింగ్, శ్రీధర్ రెడ్డి, డి.వై.ఎస్.ఓ. కార్యాలయ సిబ్బంది రాజు,మనీషా, సాయిబాబా, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన ఉపాధ్యాయుల 'విద్యా ప్రదర్శన'

- ఓజిలిలో ఘనంగా విద్యా సముదాయ సమావేశం- బోధనలో మార్పు రావాలి: ఎంఈఓ శైలజా

ఓజిలి (ప్రశ్న న్యూస్) తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించేటప్పుడు ఉపాధ్యాయులు సరికొత్త పద్ధతులను అవలంబించాలని మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) శైలజా పిలుపునిచ్చారు. సోమవారం ఓజిలి ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి విద్యా సముదాయ సమావేశంఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలల మహిళా ఉపాధ్యాయులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో కనీస అక్షరాస్యత, సంఖ్యా జ్ఞానాన్ని పెంపొందించే జీఎఫ్ఎల్ఎన్ అంశంపై మహిళా ఉపాధ్యాయులు బృందంగా ప్రదర్శించిన నాటిక (స్కిట్) విశేషంగా ఆకట్టుకుంది. క్లిష్టమైన విషయాలను కూడా విద్యార్థులకు సులభంగా, నాటక రూపంలో ఎలా వివరించవచ్చో ఉపాధ్యాయునులు తమ ప్రదర్శన ద్వారా కళ్లకు కట్టినట్టు చూపించారు.ఈ సందర్భంగా ఎంఈఓ శైలజా ,



ఎంఈఓ ( 2) చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఇటువంటి సృజనాత్మక ప్రదర్శనలు ఉపాధ్యాయుల్లో ఉత్సాహాన్ని నింపుతాయని, వీటిని తరగతి గదుల్లోనూ అమలు చేయాలని ఆకాంక్షించారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న మహిళా ఉపాధ్యాయులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.లి



లిఅనంతరం ఎంఈఓలను, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు , తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్ లో గీతం విద్యార్థికి మూడు బంగారు పతకాలు

పికిల్ బాల్ పోటీలలో ప్రతిభ చాటిన బీ.ఆర్క్. విద్యార్థిని ఆశ్రిత రాజు




పటాన్‌చెరు(ప్రశ్న న్యూస్)గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని బీ.ఆర్క్. తొలి ఏడాది విద్యార్థిని ఆశ్రిత రాజు తెలంగాణ ముఖ్యమంత్రి కప్ 2025-26 పికిల్ బాల్ పోటీలలో ప్రతిభ చాటి మూడు బంగారు పతకాలను గెలుచుకుంది. సీఎం కప్ రెండో ఎడిషన్ తుది దశ పోటీలను ఫిబ్రవరి 20-21 తేదీలలో హైదరాబాదులోని లాల్ బహదూర్ శాస్త్రి స్టేడియంలో నిర్వహించారు. పికిల్ బాల్ ఉమెన్స్ సింగిల్స్, ఉమెన్స్ డబుల్స్, మిక్స్ డ్ డబుల్స్ పోటీలలో ఆశ్రిత నెగ్గి మూడు బంగారు పతకాలను కైవసం చేసుకుంది.ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంటును తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ జనవరి 8 నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు నిర్వహిస్తోంది. ఈ ఛాంపియన్ షిప్ లో హ్యాండ్ బాల్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బిలియర్డ్స్, ఫెన్సింగ్, లాన్ టెన్నిస్, పికిల్ బాల్ వంటి పోటీలను బహుళ-స్థాయి ఫార్మాట్ లో జరుపుతున్నారు. గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రారంభమై, తరువాత మండల, పట్టణ స్థానిక సంస్థల రౌండ్లను నిర్వహించారు. చివరిగా హైదరాబాదులో రాష్ట్ర స్థాయి ఫైనల్స్ నిర్వహిస్తున్నారు.ఆశ్రిత రాజు సాధించిన అద్భుతమైన విజయానికి గీతం నాయకత్వం అభినందనలు తెలియజేసింది. గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, ఆతిథ్య విభాగం-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ తదితరులు ఆమె అంకితభావం, క్రమశిక్షణ, క్రీడా నైపుణ్యాలను ప్రశంసించారు. భవిష్యత్తు పోటీలలో కూడా గొప్ప మైలు రాళ్ల కోసం కృషిచేయాలంటూ ఆమెను ప్రోత్సహించారు.గీతం కమ్యూనిటీ ఈ విజయం పట్ల అపారమైన గర్వాన్ని వ్యక్తం చేసింది. ఇటువంటి విజయాలు విద్యా నైపుణ్యంతో పాటు క్రీడా స్ఫూర్తి, జట్టు కృషి, సమగ్ర అభివృద్ధిని పెంపొందించడంలో విశ్వవిద్యాలయం యొక్క నిబద్ధతను ప్రతిబింబిస్తాయని పేర్కొంది.

## పదవి నాకు అలంకారం కాదు

బాధ్యతగా స్వీకరిస్తున్నా

అంతే బాధ్యతగా అభివృద్ధి చేసి చూపిస్తా

22వ వార్డు కౌన్సిలర్ సద్ది నిషిత రెడ్డి




మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) నాకు ఈ పదవి అలంకారం కాదని.. ప్రజల ఆశీస్సులతో గెలిచిన ఈ పదవి బాధ్యతగా స్వీకరిస్తున్నానని ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని 22వ వార్డు కౌన్సిలర్ సద్ది నిషిత రెడ్డి పేర్కొన్నారు. ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని తన వార్డు కార్యాలయంలో పదవి స్వీకరణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితులు, వేదమంత్రాల నడుమ సద్ది నిషిత రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి పలువురు బీఆర్ఎస్ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సద్ది నిషిత రెడ్డి పదవి స్వీకరణ సంతకాలను చేసిన అనంతరం పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు శాలువాలతో సత్కరించి ప్రత్యేకంగా ఆశీర్వదాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కౌన్సిలర్ హోదాలో ప్రజాసేవ చేసుకునే భాగ్యం నాకు కలిగిందని.. ఎట్టి పరిస్థితుల్లో నాపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయనని ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోనే 22వ వార్డును మోడల్ వార్డుగా తీర్చిదిద్దుతానని ఆమె పేర్కొన్నారు.

## గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యులపాత్ర కీలకం

- బోయినిపల్లి ఎంపీడీఓ : భీమా జయశీల
- కొదురుపాకలో వార్డు సభ్యులకు శిక్షణా కార్యక్రమం




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల పరిధిలోని కొదురుపాక గ్రామంలో 2వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు మొదటి విడత శిక్షణా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గ్రామంలోని రైతు వేదికలో జరిగిన ఈ కార్యక్రమానికి మొత్తం 79 మంది వార్డు సభ్యులు హాజరయ్యారు.శిక్షణా కార్యక్రమాన్ని బోయినిపల్లి మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) భీమా జయశీల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక సమస్యల పరిష్కారం, గ్రామ పంచాయతీ పరిపాలనలో వార్డు సభ్యుల బాధ్యతలు, నిధుల వినియోగం, ప్రజలతో సమన్వయం వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.ప్రజల సమస్యలను గుర్తించి సమయానికి పరిష్కరించేందుకు వార్డు సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, గ్రామాభివృద్ధికి పాలుపంచుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఏ. శ్రీధర్, మండల పర్యవేక్షకులు పి. వెంకటరమణ, అలాగే నలుగురు టి.ఓ.టీలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అయోడిన్ పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ బాలు



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) అయోడిన్ ఉప్పు వాడకం వల్ల విద్యార్థులకు సూక్ష్మ పోషకాలు లభ్యమవుతాయని యు పి హెచ్ సి శ్రీరామ్ నగర్ కాలనీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలు అన్నారు. సోమవారం అయోడిన్ సర్వేలో భాగంగా జిపిఎస్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అయోడిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులలో పోషక ఆహార స్థితిగతులను అధ్యయనం చేయడానికి అయోడిన్ కి సంబంధించి బృహత్తర కార్యక్రమం చేపట్టామన్నారు. విద్యార్థులకు అయోడిన్ ఉప్పు వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. అయోడిన్ లోపం ఉంటే జీవక్రియ మందగిస్తుందని, దీనివల్ల అలసట, అసహనం, బలహీనత, బరువు పెరగడం వంటి సమస్యలు తలెత్తుతాయి అన్నారు. థైరాయిడ్ గ్రంథి సరైన మోతాదులో హార్మోన్ విడుదల చేయాలంటే అయోడిన్ వాడకం తప్పనిసరి అని అన్నారు. అయోడిన్ వాడకం వల్ల అనేక లాభాలు ఉన్నాయని, శారీరక, మానసిక, ఆరోగ్యం, పెరుగుదల, చురుకుదనానికి ఉప్పు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కళావతి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



'ది ప్యారడైజ్' నుంచి ఫస్ట్ సింగిల్ '

# ఆయా షేర్ ప్రోమో రిలీజ్..

## - నాని ఎనర్జీ చూసి షాక్!

నేచురల్ స్టార్ నాని అభిమానులు ది ప్యారడైజ్ చిత్రం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా నుండి ఇటీవల సూపర్ అప్‌డేట్ వచ్చింది. నాని పుట్టినరోజు సందర్భంగా ఆయన తాజా పాన్ ఇండియా చిత్రం ది ప్యారడైజ్ నుంచి ఫస్ట్ సింగిల్ విడుదల కానుంది. ఫిబ్రవరి 24న 'ఆయా షేర్' అనే టైటిల్‌తో రానున్న ఈ పాటను బర్త్‌డే ట్రీట్‌గా రిలీజ్ చేయాలని చిత్ర బృందం భావించగా, తాజాగా ప్రోమో రిలీజ్ చేశారు.ఇందులో నాని ఎనర్జీ అదిరిపోయింది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతుంది. నానిని దర్శకుడిగా పరిచయం చేసిన దసరా తర్వాత మళ్లీ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల-- నాని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమా ఇదే. ఎస్‌ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి షూటింగ్ శరవేగంగా సాగుతోంది. 'ఆయా షేర్' పాటను వందలాది డ్యాన్సర్లతో రామోజీ ఫిలిం సిటీలో భారీ ఎత్తున చిత్రీకరించినట్టు యూనిట్ వెల్లడించింది. ఈ సాంగ్‌లో నాని మాసీ అవతార్‌లో కనిపించనున్నారని, అభిమానులకు సర్‌ప్రైజ్ ప్యాకేజ్‌గా నిలుస్తుందని చెబుతున్నారు. ఈ పాటకు చార్ట్‌బస్టర్ బాణీలు అందించినది ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్. సుందర్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. బర్త్‌డే సందర్భంగా విడుదలయ్యే ఈ పాట సోషల్ మీడియాలో ట్రెండ్ సెట్ చేస్తుందని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు.

మొదట మార్చి 26న విడుదల చేయాలని భావించిన ఈ చిత్రాన్ని వాయిదా వేసి, ఇప్పుడు ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. 'ది ప్యారడైజ్'ను పాన్ వరల్డ్ స్థాయిలో విడుదల చేయాలని ప్లాన్ చేశారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, బెంగాలీ, స్పానిష్, ఇంగ్లీష్ భాషల్లో కూడా సినిమా విడుదల కానుంది. టెక్నికల్ టీమ్ విషయానికి వస్తే, ఎడిటర్‌గా నవీన్ నూలి, సినిమాటోగ్రాఫర్‌గా సి.హెచ్. సాయి, ప్రొడక్షన్ డిజైనర్‌గా అవినాష్ కొల్ల పని చేస్తున్నారు. భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న ఈ చిత్రం నాని కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందా అన్న ఆసక్తి నెలకొంది.

# విజయ్ సేతుపతి-సాయిపల్లవి కాంబో వచ్చేస్తుంది



మణిరత్నం సినిమాలంటే క్రేజ్ ఎలా ఉంటుందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ స్టార్ డైరెక్టర్ కాంపౌండ్ నుంచి రొమాంటిక్ డ్రామా రాబోతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను మణిరత్నం ముందుగా శింబుతో కానీ ధ్రువ్ విక్రమ్‌తో కానీ అంతా చేస్తాడనుకున్నారు. కానీ అనూహ్యంగా ఈ ప్రాజెక్ట్ కోలీవుడ్ స్టార్ యాక్టర్ విజయ్ సేతుపతి చేతిలోకి వెళ్లింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర కథనాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.ఇందులో సాయిపల్లవి హీరోయిన్‌గా నటించనుంది. తాజా టాక్ ప్రకారం ఇప్పటికే ఏఆర్ రెహమాన్ టీం కొన్ని ట్రాక్స్ కూడా కంపోజ్ చేసిందట. విజయ్ సేతుపతి ప్రస్తుతం చేస్తున్నసినిమాలు పూర్తవగానే.. మణిరత్నం ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు రెడీ అవుతున్నట్టు సమాచారం. త్వరలోనే ఈ మూవీ అధికారిక ప్రకటన కూడా ఉండబోతుందట.2025లో థగ్‌లైఫ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన మణిరత్నానికి ఈ మూవీ భారీ నిరాశనే మిగిల్చింది. విజయ్ సేతుపతి ప్రస్తుతం జైలర్ 2తోపాటు పలు సినిమాలను లైన్‌లో పెట్టాడు. సాయిపల్లవి Ek Dinతోపాటు ధనుష్‌తో ఊ55, రామాయణ పార్ట్ 1, రామాయణ పార్ట్ 2లలో నటిస్తోంది.

# ఉమెన్ సెంట్రిక్ స్పైథ్రిల్లర్



స్వీయ దర్శకత్వంలో పద్మనాభరెడ్డితో కలిసి పూర్వాజ్ నిర్మించిన ఉమెన్ సెంట్రిక్ స్పైథ్రిల్లర్ 'కిల్లర్'. జ్యోతి పూర్వాజ్ కథానాయిక. త్వరలో సినిమా విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఆదివారం టీజర్ రిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. కథానాయిక జ్యోతి పూర్వాజ్ మాట్లాడుతూ 'ఇందులోని నా పాత్రలో ఆరేడు షేడ్స్ ఉంటాయి. విజయశాంతిలా యాక్షన్ సినిమాలు చేయాలనేది నా డ్రీమ్. ఈ సినిమాతో ఆ కల నెరవేరింది. ఈ సినిమాకోసం డైరెక్టర్ పూర్వాజ్ చాలా కష్టపడ్డారు. నటిగా నాకు, దర్శకుడిగా పూర్వాజ్‌కీ మంచి పేరు తెచ్చే చిత్రమిది.' అని నమ్మకంగా చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎమోషనల్ డ్రామా, బ్రదర్-సిస్టర్ బాండింగ్, రివేంజ్, సబ్ కాన్షియస్ ఐడెంటిటీ.. అంశాల మేళవింపుగా రూపొందిన స్పై థ్రిల్లర్ ఇదని, స్క్రీన్‌ప్లేలో మల్టీ లేయర్లున్నా, అందరికీ సినిమా అర్థమ వుతుందని, త్వరలోనే సినిమాను రిలీజ్ చేస్తామని దర్శకుడు పూర్వాజ్ తెలిపారు. ఇంకా లైన్ ప్రొడ్యూసర్స్ సీతారామారావు, దశరథ మాధవ్, మనీష గిలాడ, గౌతమ్ చక్రధర్, విశాల్‌రాజ్, శ్రీనివాస్, చందు, కాళీచరణ్ కూడా మాట్లాడారు.

# మా ఇంటి బంగారం విడుదల అప్పుడే



'ఖుషి' తర్వాత కథానాయికగా తెలుగు తెరపై కనిపించలేదు సమంత. ఆ మధ్య 'శుభం' సినిమాలో మాత్రం అతిథి పాత్రలో మెరిశారు. కథానాయికగా సామ్ ఇంత గ్యాప్ తీసుకోవడం ఆమె అభిమానులకు మింగుడు పడటం లేదు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా తానే స్వయంగా నిర్మిస్తూ, నటిస్తున్న 'మా ఇంటి బంగారం' సినిమా విడుదల తేదీని సమంత ప్రకటించారు. మే 15న ఈ సినిమా విడుదల కానుంది. నందినిరెడ్డి దర్శకత్వంలో ట్రలాల మూవీంగ్ పిక్చర్స్ పతాకంపై సమంత నిర్మిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొని ఉంది. దానికి ఇటీవల విడుదలైన టీజర్ కూడా ఓ కారణం. కుటుంబ సాంప్రదాయాలకు విలువనిచ్చే కోడలిగా ఓ వైపు అమాయకంగా కనిపిస్తూనే, మరోవైపు యాక్షన్ మోడ్‌లో అదరగొట్టారు సమంత. ఈ టీజర్ చూసిన వారంతా సినిమా ఎప్పుడెప్పుడు విడుదలవుతుందా అని ఆతృతగా ఉన్నారు. బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే.

# రిలీజ్ డేట్ లేకుండానే..

## అడివి శేష్ డెకాయిట్ మ్యూజికల్ ప్రమోషన్స్




టాలీవుడ్ హీరో అడివిశేష్ , మృణాల్ ఠాకూర్ కాంబోలో వస్తున్న చిత్రం డెకాయిట్ (ఋఌశిఠ). షనీల్ డియో కథనందిస్తూ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా.. ధురంధర్ 2, టాక్సిక్ సినిమాలతో పోటీ వల్ల పక్కకు తప్పుకుంది. కొత్త విడుదల తేదీని మేకర్స్ ప్రకటించాల్సి ఉంది. రిలీజ్ డేట్‌పై డైలామా కొనసాగుతుంటే.. మరోవైపు మేకర్స్ మాత్రం మ్యూజికల్ ప్రమోషన్స్‌కు రెడీ అయ్యారు. కొత్త విడుదల తేదీ ప్రకటించకుండానే ఫిబ్రవరి 27న డెకాయిట్ ఫస్ట్ సింగిల్ =బఝిుతీశీ ట్రాక్‌ను లాంచ్ చేస్తున్నట్టు ప్రకటించారు. మరి ఈ రొమాంటిక్ ట్రాక్‌తోనైనా విడుదల తేదీపై క్లారిటీ ఇస్తారేమో చూడాలంటున్నారు సినీ జనాలు. తాజా టాక్ ప్రకారం ఏప్రిల్ ఫస్ట్ హాఫ్‌లో డెకాయిట్ విడుదలయ్యే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రంలో ప్రకాశ్ రాజ్, సునీల్, అతుల్ కులకర్ణి, జాన్ మేరీ ఖాన్, కామాక్షి భాస్కర్ల ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఎఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ మూవీని సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తుండగా.. సునీల్ నారంగ్ కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు. అడివిశేష్ హీరోగా నటించిన క్షణం, గూఢచారి చిత్రాలకు సినిమాటోగ్రఫర్‌గా పనిచేసిన షనీల్ డియో ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తుండటంతో అంచనాలు పెరిగిపోతున్నాయి.

# ది కేరళ స్టోరీ 2పై ముదురుతున్న వివాదాలు ..



2023లో విడుదలైన ది కేరళ స్టోరీ చిత్రం ఎంతటి చర్చనీయాంశమైందో తెలిసిందే. కేరళలో జరిగిన సంఘటనల ఆధారంగా తెరకెక్కిందని చెప్పిన ఈ చిత్రం దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున వివాదాలకు దారి తీసింది. ఇప్పుడు అదే నేపథ్యంలో రూపొందిన సీక్వెల్ ది కేరళ స్టోరీ 2మళ్లీ చర్చకు కేంద్రంగా మారింది. దర్శకుడు కామాఖ్య నారాయణ్ సింగ్ తెరకెక్కించిన ఈ సినిమా ఫిబ్రవరి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా విడుదలైన ట్రైలర్ కేరళ రాజకీయ వర్గాల్లో మరోసారి చర్చకు దారి తీసింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కేరళ అధికార కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ-ఎం), అలాగే ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలు ఈ సినిమాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈ చిత్రంపై స్పందిస్తూ, కేరళను ఉగ్రవాదానికి కేంద్రంగా చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మతాల మధ్య విభేదాలు రెచ్చగొట్టేలా సినిమా ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఇక తాజాగా బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ కూడా ఈ వివాదంలో చేరారు. ఒక మీడియా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, "ఈ సినిమా ద్వారా సమాజాన్ని విభజించాలనే ప్రయత్నం జరుగుతోంది. కేవలం డబ్బు కోసం తీసిన ప్రపగాండా సినిమా ఇది" అని వ్యాఖ్యానించారు. ట్రైలర్‌లో చూపించిన కొన్ని సన్నివేశాలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని, మతాల మధ్య అనవసర ఉద్రిక్తతలు సృష్టించేలా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. అనురాగ్ కశ్యప్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు, చిత్రబృందం మాత్రం సినిమా వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందించామని, ప్రేక్షకులే తుది తీర్పు చెప్పాలని అంటోంది. ఫిబ్రవరి 27న విడుదల కాబోయే ఈ సినిమా ప్రేక్షకుల నుంచి ఎలా స్పందన పొందుతుందో చూడాలి.

## నేను చీప్ కాపీ అయితే..

# కంగనా?

సినీ పరిశ్రమ వంటి కాంపిటేటివ్ ఫీల్డ్‌లో కథానాయికలు కలిసి స్నేహంగా మసలడం అరుదైన విషయమే. పైకి అంతా నవ్వుతూ కనిపించినా నివురుగప్పిన నిప్పులా అంతర్గత విభేదాలు ఉంటూనే ఉంటాయి. కంగనా రనౌత్, తాప్సీ మధ్య విభేదాలు తలెత్తాయంటూ గతంలో వార్తలొచ్చాయి. తాజాగా ఈ వ్యవహారంపైనే తాప్సీ స్పందించింది. 'నా వరకూ నేను ఎప్పుడూ ఎవరితో గొడవ పడలేదు. ముఖ్యంగా కంగనాపై వ్యతిరేకంగా ఒక్కమాట కూడా మాట్లాడలేదు. కానీ ఆమె సోదరి నాపై అనుచిత వ్యాఖ్యలు చేసింది. నన్ను 'చీప్ కాపీ' అంటూ సంబోధించింది. నేను ప్రేరణగా తీసుకునే నటీమణుల్లో కంగనారనౌత్ ఒకరు. నేనింకా కంగనా గొప్ప నటి అనుకుంటున్నా. నేను చీప్ కాపీ అయితే.. కంగనా ఏమవుతారు?' అంటూ తెలివిగా కౌంటరిచ్చింది తాప్సీ.



## తమ విజయంలో భాగస్వామ్యులైన చంద్రమౌళి కి
# కార్పొరేటర్ కృతజ్ఞతలు - ఘన సన్మానం

**- డివిజన్ అభివృద్ధి కి నా సంపూర్ణ మద్దతు**

**- బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు, సామాజిక సేవకులు**

**: అనుమల్ల చంద్రమౌళి**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని కొత్తపల్లి 17వ డివిజన్ కార్పొరేటర్ గా వేముల కవిత - చంద్రశేఖర్ విజయానికి అహర్నిశలు కృషి చేసిన సామాజిక వేత్త, మాజీ ఉపసర్పంచ్, బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు అనుమల్ల చంద్రమౌళి దంపతులను సోమవారం కార్పొరేటర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి, తమ విజయంలో భాగస్వామ్యులైన అనుమల్ల చంద్రమౌళి దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా అనుమల్ల చంద్రమౌళి మాట్లాడుతూ, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ వేముల కవిత చంద్రశేఖర్ మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. డివిజన్ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో తాము ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటామని తెలిపారు. సమాజ సేవలో తన వంతు పాత్రను మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్కూరి శ్రీనివాస్, పెంటి శ్రీకాంత్, దాసరి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశలో పదవ తరగతి పరీక్షలు కీలక మలుపు

**- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి**

**- భాజపా మండలాధ్యక్షులు : ఎడపల్లి పర్శరాం**

**- భాజపా ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ**






బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. భాజపా మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ నేతృత్వంలో కస్తూర్బా గాంధీ స్కూల్, మోడల్ స్కూల్, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పెన్నులు, స్కేల్‌లు, పెన్సిళ్లు, ఎగ్జామ్ ప్యాడ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నరేంద్రమోదీ ఆశీస్సులతో, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ ప్రేరణతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. బోయినిపల్లి మండలంలోని జెడ్పీహెచ్ఎస్, కస్తూర్బా గాంధీ, మోడల్ స్కూల్‌లలో పదవ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థికి పరీక్షా సామగ్రి అందించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పదవ తరగతి పరీక్షలు విద్యార్థుల జీవితంలో కీలక మలుపు అని, క్రమశిక్షణతో, ఆత్మవిశ్వాసంతో సిద్ధమై ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. చదువు కేవలం మార్కుల కోసమే కాకుండా వ్యక్తిత్వ వికాసం, భవిష్యత్తు నిర్మాణానికి పునాది కావాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి కుటుంబాలకు, గ్రామాలకు, పాఠశాలలకు, మండలానికి గౌరవం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి, మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి, స్తంభంపల్లి సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్, సీనియర్ నాయకులు సుంకపాక ప్రభు, మెరుపుల గంగాధర్, ఇల్లందుల బాలయ్య, సారంపల్లి రాజు, జనగాం లక్ష్మణ్, మినుములు శ్రీనివాస్, పెంచాల మహేష్, స్వామి కుమార్, కిరణ్, గంగాధర్ చారి, ముసుకు విజయేందర్ రెడ్డి, రజనీకాంత్, నిఖిల్, వినయ్, రాచర్ల రాజేశం, కల్యాణ్ అనిల్ తదితరులు, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి నిదర్శనం

**- కోడెమొక్కు చెల్లించుకున్న కౌన్సిలర్ సంతోషి - కరుణాకర్ దంపతులు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మూడో వార్డు కౌన్సిలర్ గుడిసె సంతోషి -- కరుణాకర్ దంపతులు స్వామివారిని దర్శించుకొని మొక్కు తీర్చుకున్నారు. మూడో వార్డు కౌన్సిలర్‌గా విజయం సాధిస్తే శ్రీ భీమేశ్వర స్వామికి కోడెమొక్కులు చెల్లిస్తామని ముందుగా మొక్కు పెట్టుకున్న వారు, తాజాగా ఆ ప్రతిజ్ఞను సోమవారం నెరవేర్చారు. ఆలయ ప్రాంగణంలో సాంప్రదాయబద్ధంగా కోడెమొక్కులు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మతానికి అతీతంగా భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకోవడం విశేషంగా నిలిచింది. ప్రజాసేవలో ముందుండే తమ కుటుంబం అన్ని మతాల పట్ల గౌరవభావం కలిగి ఉందని ఈ సందర్భంగా వారు తెలిపారు. అనంతరం స్వామివారి ఆశీర్వాదాలు పొందిన దంపతులు, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

## భాజపా ఎమ్మెల్యే, రాష్ట్ర అధ్యక్షుల
# అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం

**- చట్టం - శాంతి భద్రతలపై రాష్ట్ర ప్రభుత్వం విఫలం**

**- భాజపా మండలాధ్యక్షులు : ఎడపల్లి పరశురాం**

**- భాజపా శ్రేణుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన ప్రదర్శనలు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలో సోమవారం భారతీయ జనతా పార్టీ మండల శాఖ శ్రేణుల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామ చంద్రారావు లను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఎడపల్లి పర్శరాం మాట్లాడుతూ రాష్ట్రంలో చట్టం-శాంతి భద్రతల పరిస్థితి దిగజారిందని, ప్రతిపక్ష నాయకులు ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రశ్నించినప్పటికీ ప్రభుత్వం అరెస్టుల ద్వారా భయపెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కామారెడ్డి, బాన్సువాడ ఘటనలు, నాగర్ కర్నూలు జిల్లాలో రజక కుటుంబంపై జరిగిన దాడి వంటి సంఘటనలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. ప్రజల భద్రత, రాజ్యాంగ హక్కుల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైందని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి, మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి, స్తంభంపల్లి సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్, సీనియర్ నాయకులు సుంకపాక ప్రభు, మెరుపుల గంగాధర్, ఇల్లందుల బాలయ్య, సారంపల్లి రాజు, జనగాం లక్ష్మణ్, మినుములు శ్రీనివాస్, పెంచాల మహేష్, స్వామి కుమార్, కిరణ్, గంగాధర్ చారి, ముసుకు విజయేందర్ రెడ్డి, రజనీకాంత్, నిఖిల్, వినయ్, రాచర్ల రాజేశం, కళ్యాణం అనిల్, ఇతర నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## విజయం సాధించిన నరేందర్ ను
# అభినందించిన సిపి



ధర్పల్లి (ప్రశ్న న్యూస్ )నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల పరిధిలోని పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న నరేందర్ ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర నాలుగోవ పోలీసు గేమ్స్, స్పోర్ట్స్ మీట్ లో ధర్పల్లి పోలీసు స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న బి.నరేంధర్ పి.సి బ్రోంజ్ మోడల్స్ సాధించినందుకు సి పి సాయి చైతన్య అభినందించారు. గేమ్స్ లో పాల్గొని, రెస్లింగ్ గ్రీక్ రోమన్ 77 కేజీల విభాగంలో బ్రోంజ్ మెడల్, జిమ్నాస్టిక్స్ లో రెండు బ్రోంజ్ మేడల్స్ సాదించినందుకు పి.సాయి చైతన్య సి.పి, బి.ప్రకాశ్ ఏసిపి, బి. బిక్షపతి, సి.ఐ ధర్పల్లి అభినందించారు.

## ఈ నెల 25 నుంచే జరగబోయే ఇంటర్
# పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) సోమవారం కలెక్టరేట్ నుంచి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. ఈ నెల 25 వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యనశీ 12 గంటల వరకు జరిగే ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరగాలని, ఈ సం: ఇంటర్ మొదటి సంవత్సరం లో 6309, రెండవ సం; 6025 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా 28 కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి ఇంటర్ బోర్డు నుంచి పర్యవేక్షణ జరుగుతుందన్నారు. ఏలాంటి పేపర్ లీకేజీ లేకుండా, విద్యార్థులు కింద కూర్చొని పరీక్షలు రాయకుండా, మాల్ ప్రాక్టీస్కు అవకాశం లేకుండా, పరీక్ష అనంతరం పరీక్ష పేపర్లను పోలీస్ ఎస్కార్ట్ వాహనంతో జాగ్రత్తగా పోస్టల్ డిపార్ట్మెంట్ కు తరలించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల హాల్ టికెట్ల మీద క్యూఆర్ కోడ్ ఉపయోగించుకుని పరీక్షా కేంద్రాల అడ్రస్ ను సునాయాసంగా తెలుసుకోవచ్చు అన్నారు. పరీక్షా కేంద్రాల్లో ప్రతి హాలులో త్రాగునీరు, విద్యుత్ సరఫరా, గోడ గడియారం తప్పనిసరిగా ఉండాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, మెడికల్ కిట్టు, అత్యవసర మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలనీ సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో పరీక్షలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని తెలిపారు. టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ నగేష్, ఇంటర్ విద్యాధికారి మాధవి, ఇంటర్ పరీక్షల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కుల వివక్షపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలి

**- బీసీ బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడాలి**

**- తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లాధ్యక్షులు**

**- బత్తుల మహేందర్ యాదవ్**




వేములవాడ (ప్రశ్న న్యూస్) నాగర్‌కర్నూల్ జిల్లా, కుమ్మెర గ్రామంలో చాకలి (రజక) సామాజిక వర్గానికి చెందిన వారిపై జరిగిన దాడి కుల అహంకారానికి పరాకాష్టగా నిలిచిందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బత్తుల మహేందర్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఆలయ దర్శనానికి వెళ్లిన వారిపై దాడి చేసి, రెండు నెలల పసికందు మృతికి కారణమైన ఘటన అమానుషమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై వెంటనే సెక్షన్ 302 కింద హత్య కేసు నమోదు చేసి, ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరుపాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ.1 కోటి నష్టపరిహారం, ఒక ప్రభుత్వ ఉద్యోగం, భద్రత కల్పించాలని కోరారు. ముఖ్యమంత్రి జోక్యంతో సిట్ ఏర్పాటు చేసి, కుల వివక్ష కోణంలో సమగ్ర విచారణ జరిపి దోషులకు కఠిన శిక్ష విధించాలని మహేందర్ యాదవ్ డిమాండ్ చేశారు.

## కామారెడ్డి ఎమ్మెల్యే ను మర్యాదపూర్వకంగా
# కలిసిన వేములవాడ భాజపా నేతలు



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణానికి చెందిన భారతీయ జనతా పార్టీ నాయకులు సోమవారం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు వేములవాడ పట్టణ అభివృద్ధి, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం వంటి విషయాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ శక్తివంతం కావాలంటే క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. వేములవాడ పట్టణ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తానని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో భాజపా రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ, బచ్చు వంశీకృష్ణ, కటకం శ్రీనివాస్, వంగల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్, కీసర యశ్వంత్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బంజారాల అభివృదే మాధ్యేయం

**- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి**



ధర్పల్లి(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో గల సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలు రామారావు మహారాజ్ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా మండలంలో గల ఎస్టీ బంజారా సర్పంచులు, కాంగ్రెస్ కార్యకర్తలు ,ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ ఉత్సవానికి ముఖ్యఅతిథిగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పాల్గొన్నారు. రామారావు మహారాజ్ విగ్రహానికి పూజలు నిర్వహించి ఆయన మాట్లాడుతూ ఎస్టీల అభివృద్ధి ధ్యేయంగా సేవలాల్ మహారాజ్ ఎంత కష్టపడ్డారో అలాగే కాంగ్రెస్ పార్టీ కూడా అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ నుంచి ఇప్పటి సి ఎం రేవంత్ రెడ్డి వరకు బంజారాలను అభివృద్ధి పదంలో ముందుకు తీసుకెళుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజు, చెలిమెల శ్రీనివాస్ సర్పంచ్, ఏ ఐ బీ ఎస్ ధర్పల్లి మండల అధ్యక్షుడు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాంత్యానాయక్, మండలంలోని బంజారా సర్పంచులు, కారోబార్ లు తండా పెద్దలు పాల్గొన్నారు.

## రైతులకు ప్రకృతి వ్యవసాయం పై
# అవగాహన కల్పించిన

**శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ**




మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) రంగంపేట్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ (వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) సౌజన్యంతో రైతులకు ప్రకృతి వ్యవసాయం మరియు ప్రస్తుతం వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ గ మాట్లాడుతూ పంటలలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. నేలలో సేంద్రియ కర్బనం ప్రాముఖ్యత గురించి మరియు దానిని ఎలా పెంచుకోవాలో వివరించడం జరిగింది. రైతులకు వ్యవసాయంలో వస్తున్నటువంటి నూతన సాంకేతిక అంశాలు, యూరియా వాడకం తగ్గించడం, మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాల గూర్చి, భూగర్భ జలాల పరిరక్షణ కోసం సాగు నీటి వినియోగం పై అవగాహన, పంటల మార్పిడి వంటి అంశాల గూర్చి విస్తృతంగా రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాధికారి మాట్లాడుతూ సబ్సిడీలో వ్యవసాయ యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయని కావలసినవారు వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌడిపల్లి డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ అఫ్ అగ్రికల్చర్ పుణ్యవతి మేడం మండల వ్యవసాయ అధికారి శ్వేత , ఏ ఈ ఓ లు రోజా, అంబికా మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్లో బుర్ర తిరిగే ఆలోచనతో బర్రెను కొట్టిన మేధావి



- ఆసియాలోనే అతిపెద్ద బోయిన్ పల్లి మార్కెట్, అవినీతికి కేరాఫ్ గా నిలిచింది.? - "విజిలెన్స్ అధికారులు నిద్రావస్థలో .? చెలరేగిపోతున్న నియంత్తులు.
- బోయిన్ పల్లి మార్కెట్లో "మన కూరగాయలు కేంద్రం" మందిపాలు అయ్యేనా.? - గతంలో"సీతా లాజిస్టిక్స్ కంపెనీ "కి ఇచ్చే ఇబ్బందులు పడుతున్న అధికారులు
- కమిటీ దూకుడుకి, తలకిందులు అయిన సెక్రటరీ గుండెల్లో గుబులు, మ్యూచవల్ తో బదిలీ.? - మంత్రి సిఫార్సుతో చౌకగా కొట్టేదాం అనుకున్న బుర్ర ఉన్న మేధావి
- సుమారు 700 గజాల విస్తీర్ణం,ముప్పై వేల చదరపు అడుగుల విస్తీర్ణం,30 ఏళ్ల లీజు,సప్లయ్ సెంటర్, దొపిడికి తెర లేపిన జాదుగాళ్లు
- మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అనుమతులతో సొంతం ఆ పై కిరాయి ముసుగులో కోట్లు వసూలు.?
- గుట్టుచప్పుడు కాకుండా గత ఏడాది నవంబర్లో కమిటీ గ్రీన్ సిగ్నల్ కి సై ? నవంబర్ సెగ ఫిబ్రవరిలో కమిటిలో తగాదాలు.?
- ఛైర్మన్ నిర్ణయాన్ని నో అన్న కమిటీ సభ్యులు,మా అభిప్రాయాలు మీకు పట్టవా అంటూ నిలదీత
- గతంలో మన కూరగాయలు పేరుతో కేంద్రం నిధులు పక్కదారి పట్టించిన మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు.?
- పేరుకే రైతన్న,ఆ నేమంతో వ్యాపారం చేస్తుందేవరు.? - నగరంలో "61"మన కూరగాయలు కేంద్రాలకు
- తాళాలు.లవంగాల ఆలోచనలతో "సప్లయ్ కేంద్రాలుగా మారబోతున్నాయో.?
- అడిగేవాడు లేడని అప్పన్నంగ - దొచేస్తుంది ఎవరు?లంచాల ముసుగులో మసగబారుతున్న రైతు కేంద్రాలు
- సప్లయ్ ముసుగులో కోట్లు దండుకుంటున్న అస్మదియులు,సర్కార్ కు - సగం కూడా ఫీజు చెల్లించిన బుర్ర ఉన్న మేధావులు కోకొల్లలు.?
- కోట్ల రూపాయలు మార్కెట్ ఫీజు చెల్లిస్తున్న వారికి నిరంతరం ఇబ్బందులే.
- అడ్డదారి వ్యక్తులకు అందలమే పట్టం కడుతూ, 4 రూపాయలు వేనుకేసుకుంటున్న అధికారులు





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దేశం "జై జవాన్,జై కిసాన్ అంటుంది.కానీ ప్రస్తుతం సమాజంలో"కిసాన్ నీ ఖతం చేస్తుంది ఎవరు ?ఆరు నాళ్లు కష్టపడి పంటను పసిబిడ్డలాచూసుకునే "అన్నదాత".బువ్వ పెట్టే పెద్దన్న శ్రమను దొచెస్తున్న దొంగనా కొడుకులు కొడి నాగులు గా మార్కెట్లో కన్పిస్తున్నారు. దేశంఆర్థికంగా, ఆధునికంగాదూసుకుపోతోంది అని పాలకులు మైకులు పగిలేలాఉదరగోడుతుంటారు. ఒక పక్క కాలం కాటేస్తే కన్నీళ్లతో కంటతడి పెట్టుకుంటూ పొలంలో బక్కచిక్కిన రైతన్న ఆవేదన ఎవ్వరికీ పట్టదు. మరో పక్క కాలం అనుకూలిస్తే పంట చేతికొచ్చే గిట్టుబాటు ధర రాకపోవడంతో "రాబందుల్లా" అప్పుల బాధలతో పొలం గాడ ఉన్న చెట్టుకి ఊరి కొసకు ఉగులాడే విగతజీవిగా కానొస్తాడు అన్నదాత.ఎరువుల దుకాణాల వద్ద తెల్లవారుజాము నుంచే బారులు తీరిన అన్నదాతలు బాధలు వర్ణనాతీతం. దేశానికిస్వతంత్ర వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు కేంద్రంలో, రాష్ట్రంలో పాలకులు "రైతు" పేరుతో పీఠం ఎక్కేందుకు పథకాలు అమలు చేస్తూ "అన్నదాత"కు మాత్రం అంతా శూన్యమే మిగులుతుంది.దేశంలో ఉన్న ఇరవై తొమ్మిది రాష్ట్రాల్లో అన్నదాతలు వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ కి తరలిస్తున్నారు.కానీ రైతన్న మాత్రం రాళ్లు,ముళ్లు,చెట్ల కింద జీవితం గడుపుతున్నారు.అదే అన్నదాత పంట విక్రయించే కమీషన్ ఏజెంట్లు,దళారులు, సప్లయ్ ఏజెంట్లు కోట్లకు పడగలెత్తుతూన్నారు. ప్రస్తుతం సమాజంలో పెట్టుబడి లేని వ్యాపారం రైతులు పండించిన పంటనేదళారులకు పెద్ద పీఠం వేస్తుంది.మరో విషయం చెప్పుకోవాల్సింది ఏమిటంటే రైతులకు కమీషన్ ఏజెంట్లకు వారధిగా పని చేయాల్సిన మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు లంచాలకు రుచి మరిగి నాలుగు రూపాయలు వెనుకేసుకుంటున్నారు. ఇది తెలంగాణ రాష్ట్రంలో ఉన్న "162" మార్కెట్ ల్లో కన్పిస్తున్న కహానీలు. అడప దడప దాడుల్లో అడ్డంగా దొరికిపోతున్న వారు కేవలం కింది స్థాయి సిబ్బంది మాత్రమే!మరో విషయం ఏమిటంటే తెలంగాణ రాష్ట్రం నూతనంగా ఏర్పాటు అయినప్పటి నుంచి ప్రస్తుతం ఈరోజు వరకు ఉన్నతాధికారుల్లో బదిలీలు మాట భగవంతునికే తెలుసు.గత పదేళ్లుగా మార్కెటింగ్ డిపార్ట్మెంట్ లో కీ పోస్ట్ లో విధులు నిర్వహిస్తున్న ఉన్నత అధికారులు.దొపిడికి కేరాఫ్ గా మారిన వ్యవసాయ శాఖ. ఈ మధ్యనే వ్యవసాయ శాఖ మంత్రే సాక్ష్యాత్తు నో బదిలీ,నో ప్రమోషన్స్,మార్కెట్ యార్డ్ ల పై నో ఫోకస్ అంటూ సెలవిచ్చారు.పాలకుల నిర్లక్ష్యానికి అధికార యంత్రాంగం ఫుల్ ఫ్రెజ్ గా నూతన లైసెన్స్ లు, అడ్డదారిలో అమ్యముల మూడు పూవ్వులు ఆరు కాయలుగా వెదజల్లుతుంది వారి ఆట.ఈ మధ్యనే "సిద్దిపేట జిల్లాకు చెందిన ఓ మార్కెట్ లో సెక్రటరీ కమీషన్ కక్కుతికి, ఏజెంట్ల నుంచి భారీ గానే వసూళ్లు చేసినట్టు సమాచారం ? మరో విషయం ఏమిటంటే ఒకవేళ ఏసిబి అధికారులకు దొరికిపోతే వెనుక వేసుకున్న నాలుగు రూపాయలతో వ్యాపారం చేసుకుంటూనని సెలవిచ్చారు సార్.ఉదహరణకు గత ఎనిమిది నెలల క్రితం ఆ సెక్రటరీ శామీర్ పేట ప్రాంతాల్లో సుమారు ఎనిమిది వందల గజాల స్థలాన్ని కొనుగోలు చేసినట్లు సమాచారం ? ఇలాంటి రాబందులు పదుల సంఖ్యలో వ్యవసాయ శాఖలో పనిచేస్తున్నంత వరకు ఆ శాఖకు చెడ్డ పేరు తప్పదు. ఇప్పటికైనా వ్యవసాయ డైరెక్టర్ కింది స్థాయి అధికారుల పై ఫోకస్ చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.బోయిన్ మార్కెట్లో పెద్ద స్కాం కి తెర లేపింది ఎవరు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో చౌక ధరకే సొంతం చేసుకోవాలని వ్యూహం రచిస్తోంది ఎవరు,వారి ఆలోచన వెనుక ఎవరున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు బోయిన్ పల్లి మార్కెట్ లో బుర్ర సందీప్ కుమార్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ బీ:55 కి చెందిన సదరు కమీషన్ ఏజెంట్ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి లేఖ అందజేశారు.దాని సారాంశం గత కొన్నేళ్లుగా బోయిన్ పల్లి మార్కెట్ లో వ్యాపారం చేస్తున్న తనకి స్థలం లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.అలాగే నిరుపయోగంలో ఉన్న "మన కూరగాయలు కేంద్రాన్ని"బుర్ర సందీప్ కుమార్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ కి "ముప్పై ఏళ్ల లీజు"కింద మంజూరు చేయాలని కోరారు.మంత్రి నుంచి వ్యవసాయ డైరెక్టర్ దృష్టికి రావడంతో ఆయన బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ,సెక్రటరీ కి వాస్తవాలుతో కూడిన నివేదిక పంపాలని సూచించారు.ఈ నేపథ్యంలో సదరు కమీషన్ ఏజెంట్,కమిటీ ఛైర్మన్ కుమ్మక్కై అప్పటి సెక్రటరీ పై వత్తిడి తేవడంతో నవంబర్ 29/2025 న కమిటీ సమావేశంలో సభ్యులతో చర్చించి కుండా మినిట్స్ లో ఎంట్రీ చేశారు కానీ నివేదిక ఉన్నతాధికారులకు పంపలేదు.సదరు కమీషన్ ఏజెంట్ నుంచి వత్తిడి రావడంతో సెక్రటరీ ఎం వేంకన్న "మ్యూచివల్ బదిలీ" కింద ఆయన మిర్యాలగూడ కి బదిలీ అయ్యారు.ఈ నేపథ్యంలో ఈ నెల ఫిబ్రవరి 18/2026 న కమిటీ సమావేశంలో "బుర్ర సందీప్ కుమార్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్"ముప్పై ఏళ్ల లీజు అంశం పై చర్చించిన కమిటీ.నో అంటూ కమిటీ సభ్యులు ససేమిరా అనడంతో కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది.అపూర్వ అనుభవం ఉన్న సదరు కమీషన్ ఏజెంట్ "దుర్గా అండ్ కం.వెజిటెబుల్ కమీషన్ ఏజెంట్.కమిటి సభ్యులు డిసి ప్రభాకర్ తన వాణిని బలంగా వినిపించారు.అలాగే మార్కెట్ లో సప్లయ్ వ్యవస్థకి కమిటీ సపోర్ట్ గా ఉండదు, సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ సభ్యుడు గా నేను వ్యతిరేకిస్తున్నని ఆయన అన్నారు.మరో విషయం ఏమిటంటే కమిటీలో ఏ అంశం అయిన చర్చకు రావాల్సిందే,కానీ మాకు తెలియ కుండా పలు కీలక అంశాలపై మీరే ఎలా నిర్ణయం తీసుకుంటిరని ప్రభాకర్ నిలదీశారు.ఈ కమిటిలో మాకు చోటు కల్గిందంటే కేవలం సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ సభ్యులుగా ఉన్నందుకు అలాంటిది అర్హత లేని వారికి వెసులుబాటు కల్పిస్తే,నలప్పై ఏళ్లుగా వ్యాపారం చేస్తూ ఏటా కోట్ల రూపాయలు మార్కెట్ ఫీజు చెల్లిస్తున్న పెద్దలు మమ్మల్ని నిలదీస్తే ఎం సమాధానం చెప్పాలని ఛైర్మన్ నీ నిలదీశారు సదరు సభ్యులు. గత కొన్ని రోజులుగా మార్కెట్ కమిటీలో పలు అంశాలపై ఘూటుగ చర్చ జరుగుతోంది.విశ్వసనీయ సమాచారం మేరకు "బిఎస్కే" అంశం పై లక్షల రూపాయలు చేతులు మారినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇంత తతంగం బాహాటంగా జరుగుతున్న "మార్కెట్ విజిలెన్స్ అధికారులు"మొద్దు నిద్రలో ఉన్నారా అని మార్కెట్ వర్గాలు ప్రశ్నిస్తున్నారు.ఇలానే కమిటీ, అధికారులు వ్యవహరిస్తే భారీ ఆదాయంతో ఉన్న మార్కెట్ ఖయ్యాల మార్కెట్ గా వేదిక అవుతుంది.ఇప్పటికైనా వ్యవసాయ డైరెక్టర్, మార్కెటింగ్ డైరెక్టర్,మార్కెట్ విజిలెన్స్ అధికారులు కదం తొక్కితే గానీ "రైతన్న"కు న్యాయం జరగదు.



### టి ఎమ్మార్పీఎస్ నేత ఇటుక గోపి మార్కెట్‌లో అవినీతిని ఎండగడుతాం..

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో జరుగుతున్న అవినీతి పై త్వరలో వ్యవసాయ డైరెక్టర్, మార్కెటింగ్ డైరెక్టర్ తో కలిసి బోయిన్ పల్లి మార్కెట్ లో కమీషన్ ఏజెంట్ల చేస్తున్న "మాయాజాలం"గురించి చర్చిస్తామని గోపి తెలిపారు. అలాగే "మన కూరగాయలు "కేంద్రాన్ని సొంతం చేసుకునే వారి ఆలోచనలు అంతర్యం ఎమిటో తెలుసు!గత సంవత్సరం నవంబర్ లో పాలకమండలి సమావేశంలో "మన కూరగాయలు కేంద్రం " పై చర్చ జరగకుండా,సెక్రటరీ పై వత్తిడి తర్వాత బదిలీ. అన్నీ విషయాలు పై కూలంకషంగా ఉన్నత అధికారులతో చర్చించిస్తామని,స్థానికంగా చోటు చేసుకుంటున్న అవినీతి దందా పై కూడా మాట్లాడుతామని గోపి వెల్లడించారు.మరో విషయం ఏమిటంటే బోయిన్ పల్లి మార్కెట్ లో గతంలో "సీతా లాజిస్టిక్స్ కంపెనీ"కి ఇరవై మూడు సంవత్సరాలు పాటు లీజు ఒప్పందం జరిగిన విషయం విదితమే!కానీ ఆ నిర్వాహకులు నిర్వాకం వల్ల "కోర్టు"పరిధిలో ఉంది.ఇప్పుడు మరో కొత్త ఆలోచనతో "మన కూరగాయలు కేంద్రం"30 ఏళ్ల పాటు లీజు, ముప్పై వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్నలి700లిగజాల స్థలాన్ని సొంతం చేసుకోవాలనే ఉద్దేశంతో ఉన్న వారికి పాలకమండలి,అధికారులు సహకరిస్తే ఊరుకునే ప్రసక్తి లేదని స్పష్టం చేస్తున్నారు. అలాగే సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎస్సీ రిజర్వేషన్ నియోజకవర్గం.అదిగాక మా దైవం పేరుతో నామకరణం చేసిన "డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్"నీ అవినీతికి కేరాఫ్ గా ఉంచే వాళ్ల బడతం పడుతాం అని టి ఎమ్మార్పీఎస్ ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్ ఇటుక గోపి ఆవేదన వ్యక్తంచేశారు.ఇప్పటికైనా బోయిన్ పల్లి సెక్రటరీ మన కూరగాయలు కేంద్రం 30 ఏళ్ల లీజు అంశాన్ని విరమించుకోవాలి లేని పక్షంలో ఉద్యమమే ఊపిరిగా ముందుకు సాగుతామని గోపి తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాల మైదానంలో జెయింట్ వీల్ ఏర్పాటు పనులు

- విద్యార్థుల ఆటస్థలానికి ఎసరు
- ప్రభుత్వ పాఠశాల క్రీడా ప్రాంగణంలో ప్రైవేట్ వ్యాపారం ఏంటి
- విద్యాశాఖ అధికారుల కనుసైగల్లో జరుగుతోందా.?
- విద్యార్థులకు అనుకోని ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది.?
- సీఎం కప్ పేరుతో విద్యార్థులకు క్రీడలపై ప్రోత్సహిస్తుంటే
- కొంతమంది విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతో రేవంత్ ప్రభుత్వానికి చెడ్డ పేరు

**"తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ ప్రైవేటు పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటుంటే మరోవైపు కొంతమంది కిందిస్థాయి విద్యాశాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు నిర్లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వానికే కాదు ప్రభుత్వ పాఠశాలలకు సైతం చెడ్డ పేరు వస్తుంది"**

మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) విద్యార్థులు విద్యతో పాటు మంచి ఆరోగ్యం, శారీరక దృఢత్వం కోసం సీఎం కప్ పేరుతో విద్యార్థుల్లో దాగున్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఒకవైపు క్రీడల పేరుతో విద్యార్థులను ప్రోత్సహిస్తుంటే మరోవైపు విద్యార్థులు ప్రతినిత్యం ఆడుకోవాల్సిన ప్రభుత్వ పాఠశాల మైదానం ఇప్పుడు ప్రైవేట్ వ్యాపారాలకు వేదికగా మారుతోంది. మేడ్చల్ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో కొందరు ప్రైవేట్ వ్యక్తులు యథేచ్ఛగా జాయింట్ వీల్ తో పాటు పలు ఇనుప సామాగ్రిని ఏర్పాటు చేయడంతో ఏర్పాటుచేసిన ఇనుప సామాగ్రి వల్ల తమ పిల్లలకు అనుకోని ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### నిబంధనలు గాలికి..

సాధారణంగా ప్రభుత్వ విద్యాసంస్థల ఆవరణలను కేవలం విద్యా సంబంధిత కార్యక్రమాలకు లేదా ప్రభుత్వ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలి. కానీ ఇక్కడ అందుకు భిన్నంగా భారీ జాయింట్ వీల్స్, ఎగ్జిబిషన్ సామగ్రి వచ్చి చేరాయి. మైదానంలో భారీ యంత్రాలను అమర్చడం వల్ల క్రీడా ప్రాంగణం దెబ్బతినడమే కాకుండా, విద్యార్థుల భద్రతపై కూడా ఆందోళన వ్యక్తమవుతోంది. పాఠశాల క్రీడా ప్రాంగణంలో భారీ వాహనాలు, ఇనుప రాడ్ల ఏర్పాటు వల్ల మైదానంలో గుంతలు పడి విద్యార్థులు ఆడుకోవడానికి వీలు లేకుండా పాఠశాల క్రీడా ప్రాంగణం పాడయ్యే అవకాశం ఉందని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు పాఠశాల




సమయంలో ఇటువంటి భారీ పరికరాల ఏర్పాటు వల్ల విద్యార్థులకు అనుకోని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

### ప్రభుత్వ పాఠశాల క్రీడా ప్రాంగణంలో ప్రైవేట్ వ్యాపారం

విద్యాశాఖ నిబంధనల ప్రకారం పాఠశాల ఆవరణలో ప్రైవేట్ వ్యాపారాలకు అనుమతి ఉండదు. మరి ఈ జాయింట్ వీల్ ఏర్పాటుకు ఎవరు అనుమతి ఇచ్చారు ? స్థానిక విద్యాశాఖ అధికారుల పాత్ర ఏమిటి ? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ లాభాల కోసం వాడుకోవడంపై తల్లిదండ్రులు, విద్యావేత్తలు మండిపడుతున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి, మైదానం నుండి ఆ ప్రైవేట్ పరికరాలను తొలగించాలని, పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులతో పాటు క్రీడా ప్రాంగణాన్ని కాపాడాలని కోరుతున్నారు.





Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588